RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 56 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం , ఆగస్టు, 15, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 56 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday, August, 15, 2025 | PAGES : 8 RS : 4 /- |





## ఓటు చోరీ పదంతో ప్రజలను
# అవమానించొద్దు

- ఆధారాలు ఉంటే అఫిడవిట్ ద్వారా తెలియ చేయాలి
- రాహుల్ విమర్శలకు ఇసి మరోమారు ఘాటు జవాబు

న్యూఢిల్లీ, : దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష పార్టీలు చేస్తున్న ప్రచారంపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో 'ఓటు– చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని తప్పుపట్టిన ఈసీ.. తప్పుడు కథనాలకు కారణమయ్యే 'అసభ్యకర పదాలు' ప్రచారం చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది.



## వీధి కుక్కల తరలింపుపై సుప్రీంకోర్టులో
# వాడీవేడి వాదనలు

- ఆదేశం రాకముందే కుక్కలను పట్టుకోవడంపై అధికారులకు ధర్మాసనం ప్రశ్న
- షెల్టర్ హెూమ్స్ లేనప్పుడు కుక్కలను ఎక్కడికి తీసుకెళతారని నిలదీత
- గతేడాది 37 లక్షల కుక్కకాటు కేసులు నమోదయ్యాయన్న ప్రభుత్వం
- చట్టాలు అమలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి అని కోర్టు వ్యాఖ్య

ఢిల్లీ,: ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో వీధి కుక్కలను పట్టుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వీధి కుక్కలను షెల్టర్ హెూమ్స్‌కు తరలించాలంటూ తాము ఇచ్చిన ఆదేశాలు బహి ర్గతం కాకముందే అధికారులు వాటిని పట్టుకోవడం ఎలా మొద లుపెట్టారని ధర్మాసనం ప్రశ్నిం చింది. జంతు నియంత్రణ మార్గదర్శకాలను సరిగా అమలు చేయకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని అధికారుల తీరుపై మండిపడింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఆగస్టు 11న ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఢిల్లీలో పెరుగుతున్న కుక్కకాటు ఘటనలపై సుమోటోగా స్పందిస్తూ, వీధి కుక్కలన్నింటినీ షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది.



## యుద్ధం ఆపకపోతే..
## తీవ్ర పరిణామాలు
# తప్పవు

**కీలక భేటీకి ముందు పుతిన్‌కు ట్రంప్ హెచ్చరిక**

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను గట్టిగా హెచ్చరించారు.
ఈ రోజు అలాస్కాలోని యాంకరేజ్‌లో ఇరు దేశాధినేతల మధ్య జరగనున్న శిఖరాగ్ర సమావేశానికి ముందు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశం తర్వాత కూడా యుద్ధాన్ని కొనసాగిస్తే రష్యా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు.



## మీరేమైనా యుద్ధానికి
# వెళ్తున్నారా..?

**వాహనాలకు ఆ రంగులేంటి?**

- హైడ్రా తీరుపై మరోసారి హైకోర్టు ఆగ్రహం
- తీరు మార్చుకోకుంటే కఠిన నిర్ణయాలు

హైదరాబాద్,తెలంగాణ దిశ : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వే నంబర్ 37, 38/1లో 1.07 ఎకరాల భూమిపై ఎందుకంత దూకు డుగా వెళ్తున్నారని హైడ్రా (హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తి సంరక్షణ విభాగం) కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు స్టేటస్‌కో ఆదేశాలు పాటించాలని చెప్పినా వినకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

## వర్షాలపై అప్రమత్తంగా
# ఉండండి

- తక్షణ సహాయ చర్యలకు సింద్ధం కావాలి
- సహాయక చర్యలకు జిల్లాకు కోటి విడుదల
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్,తెలంగాణ దిశ : వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు- తెలిపారు.






- తొలంగించిన 65లక్షల పేర్లనుప్రచురించండి
- మరణించిన 22లక్షల మంది వివరాలు వెల్లడించండి
- 19వ తేదీలోపు వివరాలు ఇవ్వండి...22 నాటికి మాకు ఇవ్వండి
- బీహార్‌లో ఓట్ల తొలగింపు వ్యవహారంపై విచారణ
- ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశం

# ఎన్నికల సంఘానికి గట్టి దెబ్బ

న్యూఢిల్లీ, : ఎన్నికల సంఘానికి గట్టి దెబ్బ తగిలింది. బీహార్ ఓటర్ జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, వారి పేర్లను తొలగించడానికి గల కారణాలను కూడా అప్‌లోడ్ చేయాలని సూచించింది. ప్రతి ఓటరు దానిని యాక్సెస్ చేయగలిగేలా ఈ జాబితాను ప్రచారం చేయాలని సూచించింది. అయితే.. ఆ 65 లక్షల మంది వివరాలను ఈ నెల 19లోపు బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ నెల 22 నాటికి సంబంధిత నివేదికను తమముందు ఉంచాలని సూచించింది. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్ విచారించారు. జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మందిలో 22 లక్షల మంది మరణించారని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. 22 లక్షల మంది మరణించినట్లయితే, దానిని బూత్ స్థాయిలో ఎందుకు వెల్లడించలేదని, పౌరుల హక్కులు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉండాలని తాము కోరుకోవడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.



## కన్నడ నటుడు దర్శన్‌కి
# బెయిల్ నిరాకరణ

**దర్శన్, పవిత్రగౌడను అరెస్టు చేసిన బెంగళూరు పోలీసులు..!**

బెంగళూరు : కన్నడ నటుడు దర్శన్ తూగుదీప బెంగళూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రేణుక స్వామి హత్య కేసులో దర్శన్‌కు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిన కొద్ది గంటల్లోనే అరెస్టు చేయడం గమనార్హం. దర్శన్‌తో పాటు అతని స్నేహితురాలు పవిత్ర గౌడను సైతం బెంగళూరు పోలీసులు అరెస్టు చేయగా.. ఇద్దరిని ట్రయల్‌కు కోర్టులో హాజరుపరుస్తారు. వైద్య పరీక్షల తర్వాత ఇద్దరిని జైలుకు తరలించనున్నారు. రేణుకస్వామి హత్య కేసులో దర్శన్‌కు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కర్నాటక ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

## జాతీయ రాజకీయాల్లోకి
# బాలయ్య

హైదరాబాద్,తెలంగాణ దిశ: ఏపీలో రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి అనేక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో చాలామంది ప్రముఖుల నియోజకవర్గాల మార్పు అనివార్యం అయ్యేలా ఉంది. ముఖ్యంగా నందమూరి బాలకృష్ణ నియోజకవర్గం మారుతారని ప్రచారం జరుగుతోంది. అవసరం అనుకుంటే తెలంగాణలో బాలకృష్ణ పోటీ చేస్తారని టాక్ నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో నందమూరి బాలకృష్ణ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ శంకుస్థాపన జరిగింది.



# వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ. కోటి మంజూరు

## – వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 14, (తెలంగాణ దిశ)** :రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండి ఏవిధమైన ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి గురువారం నాడు సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గడచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల,భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్‌గా ఉన్న మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్లను అప్రమత్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు కోటి రూపాయిలు విడుదల చేశామని అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్దంగా ఉన్నామని తెలిపారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా లో లెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబల కుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకుసూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు మను చౌదరి, డిసిపి పద్మజ, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ పాల్గొన్నారు. జిల్లాకలెక్టరు మాట్లాడుతూ నిన్నటి నుండి జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యిందని,జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాలో పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. ఆర్అండ్ బి, ఇరిగేషన్, మెడికల్, పోలీస్, మత్స్య,తదితర శాఖ అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు.

# సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి





**ఏఎస్ రావునగర్, ఆగస్టు 14, (తెలంగాణ దిశ)** :సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కుషాయిగూడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.భాస్కర్ రెడ్డి సూచించారు. గురువారం కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కార్యాలయంలో సైబర్ నేరాలపట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీ వాసులకు, సీనియర్ సిటిజనులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా తగిన సలహాలు, సూచనలు చేసారు. అంతేకాకుండా కాలనీలో సీసీ కెమెరాలు అమర్చడం వల్ల నేరాల నియంత్రణతో పాటు పటిష్టమైన నిఘా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీలైనంతవరకు తమ పరిసరాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు, శాంతియుత సమాజానికి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్ స్పెక్టర్ విజయ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ గా చల్లా ప్రభాకర్





**కుషాయిగూడ, ఆగస్టు 14, (తెలంగాణ దిశ):** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ గా చల్లా ప్రభాకర్‌ను నియమించారు. గురువారం హబ్సిగూడ సుప్రభాత్ హొ టల్ లో జరిగిన మల్కాజిగిరి పార్లమెంట్ స్థాయి గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో పార్లమెంట్ ఇంచార్జ్ నాయని బుచ్చిరెడ్డి నియా మక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చల్లా ప్రభాకర్ మాట్లా డుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందజేసే విధంగా పనిచేసి హిందుత్వ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని అన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పజెప్పిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. తనకు బాధ్యత రావడానికి సహకరించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్, కార్యదర్శి రమేష్ బాబు, ఓబిసి మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, కేంద్ర కమిటీ సభ్యులు రేవల్లి రాజులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఉడుత నవీన్, ఫణిందర్, గొనె శ్రీకాంత్, రవీందర్ గౌడ్, రుత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత వార్తలు రాసిన విలేకరులను వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించిన డిపిఆర్ఓ




**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 14, (తెలంగాణ దిశ) :**
యూరియా కొరత ఉందని వార్తలు రాసిన రాజన్న సిరిసిల్ల జిల్లా డిపిఆర్ఓ ఈనాడు రిపోర్టర్లను వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించారు. జిల్లాలోని ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ తో సహా అన్ని మండలాల విలేకర్లను కలెక్టర్ డీపీఆర్ఓ అఫీషియల్ వాట్సాప్ గ్రూపు నుంచి తొలగించారు. ఇదేమిటని డిపిఆర్ఓ ను ప్రశ్నించగా కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించామని స్పష్టం చేశారు. గతంలో సమస్య ఉందని రాస్తే నమస్తే తెలంగాణ, సాక్షిలతో పాటు పలు విలేకర్లపై ఇదే రకమైన నిబంధాన్ని అధికారులు ప్రయోగించారు. ఈనాడు దినపత్రిక విలేకరులపై ఇలాంటి చర్యలు తీసుకోవడంతో జర్నలిస్టులు విస్తు పోయారు.

# నాగారం రాంపల్లి చౌరస్తాలో ఘనంగా విభజన గాయాల స్మృతి దినం

## బిజెపి నేతృత్వంలో అఖండ భారత్ సంకల్ప కార్యక్రమం




**నాగారం, ఆగస్టు 14, (తెలంగాణ దిశ):** భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆధ్వర్యంలో గురువారం నాగారం రాంపల్లి చౌరస్తాలో విభజన గాయాల స్మృతి దినాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ ఏకతా, చారిత్రక వారసత్వంపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. 2021లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 14ను "దేశ విభజన గాయాల స్మృతి దినం"గా ప్రకటించారు. ఈ సందర్భంగా 1947లో భారత ఉప ఖండ విభజనలో ఏర్పడిన హింస, సామూహిక వలసలు, మానవ నష్టాలను స్మరించుకున్నారు. బీజేపీ %తీ% పిలుపు మేరకు పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కన్వీనర్ గాలి సంపత్ యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ 1947 దేశ విభజన సమయంలో ప్రాణాలు అర్పించిన వారికి నివాళులు అర్పించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, కొమ్మిడి శోభా దామోదరరెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు గొంగల్ల మహేష్, జిల్లా నాయకులు హైమా రెడ్డి, బోడ శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ బుద్ధవరం లక్ష్మి వేణుగోపాల్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేంద్ర యాదవ్, నాగారం మున్సిపల్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు తోట నరేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ...



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 14, (తెలంగాణ దిశ)** :ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. 126 డివిజన్ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు గండిరాజు యాదవ్, రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గమ్ లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ మీద దాడి చేసి తొమ్మిది ఉగ్రవాద సంస్థలను పేల్చేసి, దేశ సైనికుల సత్తాను కీర్తిస్తూ వారికి మద్దతుగా జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ప్రతి భారతీయుడు మీ ఇండ్ల మీద జాతీయ జెండాలను ఎగర వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం ఇంచార్జీ శివానంద్, జిల్లా స్పోక్స్ పర్సన్ సురేష్ రెడ్డి, జిమ్ శ్రీహరి, రఖి నాయక్, భాస్కర్, కుమార్ యాదవ్, శ్రీనివాస్, ముత్యాలు, రవి, సుధాకర్ రమేష్, నాగరాజు, వాణి స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు పవిత్రతను కాపాడాలి




## మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత ముదిరాజ్

**హైదరాబాద్, ఆగస్టు 14, (తెలంగాణ దిశ):** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు పవిత్రతను కాపాడాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత ముదిరాజ్ పిలుపు నిచ్చారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన ప్రజా పోరాటానికి సంఘీభావంగా మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ ఇచ్చిన పిలుపు మేరకు మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా క్యాండిల్ మార్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఖైరతాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన క్యాండిల్ మార్చ్ కార్యక్రమానికి సునీత ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విహెచ్ హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శైలజ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీతా రావు మాట్లాడుతూ "మన ఓటు..., మన హక్కు" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తెస్తున్నామని అన్నారు. మహిళల గొంతుకను బలోపేతం చేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ కు రాహుల్ గాంధీ చూపెట్టిన ఆధారాలను నివృత్తి చేయవలసిన అవసరం ఉందన్నారు.



# సంపాదకీయం

## డాలర్ డ్రీమ్సేనా..?

అమెరికా 47వ అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో అడుగుపెట్టిన డొనాల్డ్ ట్రంప్ తొలి రోజే పలు సంచలనాలకు తెరతీశారు. ఎన్నికల ప్ర చార సమయంలో హామీ ఇచ్చినట్లుగా అక్రమ వలసలను అరికట్టడంతో పాటుగా పదుల సంఖ్యలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో అత్యం త ప్రధానమైనది 'జన్మతః పౌరసత్వం'పై వేటు. దాదాపు వందేళ్లుగా అనుసరిస్తూ వస్తున్న ఈ విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతల చేపట్టిన వెంటనే అక్రమ వలసలపై డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన లక్షల మంది విదేశీయులను ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికాకు అక్రమంగా వచ్చినవారిని వెనక్కి పంపడం ఖాయమని ట్రంప్ చేసిన ప్రకటన వణికిస్తోంది. తాత్కాలిక వీసాలపై వచ్చినవారిదీ ఇదే పరిస్థితి. సరైన పత్రాల్లేకుండా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరుల సంఖ్య దాదాపు 1.40 కోట్లు ఉంటుందని అంచనా. వీరిలో సుమారు 7.25 లక్షల మంది భారతీయులే. మెక్సికో, ఎల్ సాల్వెడార్ పౌరుల తర్వాతి స్థానం మనోళ్లదే. ఈ నిర్ణయం ప్ర భావం అమెరికాలో ఉంటున్న లక్షలాదిమంది భారతీయులపై తీవ్ర ప్రభా వం చూపించనుంది. అక్రమంగా అమెరికాలో ఉంటున్న వారితో పాటుగా విద్యార్థులు, టూరిస్టు, హెచ్1బీ లాంటి తాత్కాలిక వర్క్ వీసాలపై దే శంలో ఉంటున్న వారికి జన్మించే పిల్లలకు ఇకపై అమెరికా పౌరసత్వం ల భించదు. ఈ తరహా పౌరసత్వాన్ని ఏ దేశం కూడా ఇవ్వడం లేదని, తాముకూడా ఇచ్చేది లేదని ట్రంప్ స్పష్టం చేశారుతల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరై నా అమెరికా పౌరసత్వం, శాశ్వత నివాసం, గ్రీన్‌కార్డు, అమెరికా మిలిటరీ సభ్యత్వం ఇలా ఏదైనా ఒక గుర్తింపు ఉంటేనే వారి పిల్లలకు పుట్టుకతో దే శ పౌరసత్వం ఇస్తామని తేల్చి చెప్పారు. అయితే అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం ఇస్తున్నట్లు ట్రంప్ చెప్పిన దాంట్లో నిజం లేదు. ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాలు ఇలా పౌరసత్వాన్ని ఇస్తున్నాయి. అమె రికాలో అంతర్యుద్ధం ముగిసిన మూడేళ్ల తర్వాత 1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణతో ఈ హక్కు లభించిందశరణార్థులుగా వచ్చిన నల్లజాతివారిని బానిసలుగా చూసే దుష్ట సంప్రదాయానికి ముగింపు పలకడానికి ఇది వీలు కల్పించింది. ఇప్పుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఇది రద్దు కానుంది. ఈ ఉత్తర్వు 30 రోజుల తర్వాతినుంచి అమలులోకి రానుంది. అయితే చట్టబద్ధంగా ఇది అమలు కావడం అసాధ్యమని నిపుణులు అంటున్నారు. ట్రంప్ ఉ త్తర్వులను న్యాయస్థానాలు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించే అవకాశం ఉందిఅమెరికా సుప్రీంకోర్టు సైతం జన్మతః పౌరసత్వాన్ని సమర్థించింది. ఆ అవకాశాలు లేకపోలేదని ట్రంప్ కూడా చెప్పడం గమనార్హం. అంతేకాదు ఉత్తర్వు అమలుకు రాజ్యాంగ సవరణ అవసరం. అమెరికా పార్లమెంటులోని ఉభయ సభలు మూడింట రెండు వంతుల మెజారిటీతో సవరణను ఆమోదించాలి. ఇది సుదీర్ఘ ప్రక్రియ. మరోవైపు ట్రంప్ నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాలు చేసేందుకు హక్కుల సంఘాలు సిద్ధమవుతున్నాయి. ఇదంతా అటుంచితే దీని ప్రభావం భారతీయులపై తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. 2024 నాటికి అమెరికాలో దాదాపు 54లక్షల మంది భారతీయులు ఉన్నారు. దేశ జనాభాలో 1.47 శాతానికి ఇది సమానం. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టిన వారు కాగా, మిగతా వా రంతా వలస వచ్చిన వారే. అందులో ఎక్కువమంది హెచ్1బీ వీసా కింద వచ్చిన వారే. వాస్తవానికి అమెరికా వెళ్లిన భారతీయుల్లో చాలామంది తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం పొందేందుకు 'బర్త్ టూరిజం'ను అంటే పిల్లలకు జన్మనివ్వడం కోసమే అమెరికాకు వెళ్లడాన్ని ఒక మార్గంగా ఎంచుకొంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. మెక్సికో, చైనాలాంటి దేశాల వారూ ఇదే పద్ధతి అనురిస్తున్నారు. అందులో కొంత వాస్తవం లేకపోలేదు. ఎందుకంటే గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా అది దక్కా లంటే ఏళ్ల తరబడి వేచిచూడాలి. అందుకే తమ పిల్లలకు, తద్వారా తమ కూ అమెరికా పౌరసత్వం దక్కేందుకు ఈ మార్గాన్ని ఎంచుకొంటున్నారు. ఇప్పటికే ఇలా అమెరికాలో పుట్టిన పిల్లలు వేల సంఖ్యలో ఉ న్నారు. వీరు కూడా అమెరికాలోనే ఉండాలంటే చదువుతో పాటుగా అన్ని విషయాల్లో ను ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. అలాగని కుటుంబాలు వేరుపడడం కూడా సాధ్యం కాదు. స్వదేశానికి తిరిగి వెళ్లడం ఒక్కటే మార్గం. ట్రంప్ కోరుకొంటున్నది కూడా అదే. అయితే దేశంలోని అన్ని వ్యవస్థలపైనా దీని ప్రభావం పడుతుందనేది నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో ఎమర్జెన్సీ విధించి.. మరిన్ని బలగాలను మోహరిస్తామని ట్రంప్ ప్రకటించారు. చట్టవిరుద్ధంగా నివసిస్తున్న విదేశీ పౌరులను అందర్నీ గుర్తించి.. వారిని తిరిగి వారి వారి దేశాలకు పంపించేందుకు ట్రంప్ యంత్రాంగం చర్యలు మొదలుపెట్టింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా ట్రంప్ సర్కారుతో కలిసి పనిచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోం దని.. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని.. తత్ఫలితంగా వాణిజ్య యుద్ధాన్ని నివారించేందుకు,ట్రంప్‌నకు సహకరించేందుకు ఇది ముందస్తు ఆలోచన అని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# భౌతికవాద పునరుజ్జీవం నేటి కర్తవ్యం..



భారతదేశంలోని విశ్వవిద్యాలయాల్లో భారతీయ భౌతిక తత్వ శాస్త్రాన్ని బోధించకపోవడం వలన భారతీయ తాత్విక మూలాలు విద్యార్థులకు, ఆధునిక మేధావులకు అందడంలేదు. అసలు నిజానికి భారతీయ మొదటి తత్వశాస్త్ర భాగాలుగా చార్వాకం, జైనం, బౌద్ధం, సాంఖ్యం ప్రసిద్ధమైనవిగా చెప్పబడినవి. సర్వదర్శన సంగ్రహంలో వీటినే తత్వశాస్త్ర మొదటి దర్శనాలుగా ప్రకటించారు. ఈనాడు అన్ని కేంద్ర విశ్వవిద్యాలయాల్లోను, రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లోను తత్వశాస్త్ర విభాగాల్లో చార్వాకాన్ని చెప్పకపోవడం వలన వేదాలే మొదటివి అనుకునే పరిస్థితి వచ్చింది. కాని నిజానికి వేదాలు భారతీయ భౌతికవాదాన్ని పూర్వపక్షంగా వచ్చినవే. భారతదేశం ప్రధానంగా నదీ నాగరికతతో పాటు మాతృస్వామికమైన దేశం. నిప్పు, నీరు, గాలి, నేలను జీవన విధానంగా మలుచుకోన్న దేశం. ఈ మూలాలు విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు తెలియకపోతే వారికి ప్రాకృతిక భౌతిక జ్ఞానం తగ్గుతుంది. ఇప్పుడు ప్రయాగలో జరుగుతున్న కుంభమేళా నదీ నాగరికతను ఎలా విధ్వంసం చేస్తుందో తెలుసుకోలేరు. భారతదేశంలో తత్వ శాస్త్రమంటే ఆధ్యాత్మిక వాదంగా ప్రచారం చేశారు. తత్వశాస్త్రమనగానే ఆత్మ గురించో, పరలోకం గురించో చెప్పేదనే భావన ఏర్పడింది. నిజానికి భౌతికాంశాల నుండి రూపొందిన దాన్నే తత్వ శాస్త్రం అంటారు. భారతదేశంలో అతి ప్రాచీన జాతులు ఈ తాత్వికాంశాల మీద సుదీర్ఘమైన చర్చ చేశారు. శరీరానికి, చైతన్యానికి ఉన్న సంబంధాన్నీ మానవునికీ ప్రకృతికి ఉన్న సంబంధాన్నీ విశ్వ పరిణామాన్ని, మానవ పరిణామాన్నీ భౌతిక దృక్పథంతో వారు వివేచించారు. మానవునికి తన చుట్టూ వున్న ప్రకృతి, సమాజం పట్ల ఉదయించిన అనేక ప్రశ్నలకు వారు భౌతిక దృక్పథంతో సమాధానం వెతికారు. మానవుడు భౌతిక ప్రపంచం నుండి ప్రభవించడం వల్ల అతని ఆలోచనలు, భావాలు, ఊహలు భౌతిక వాస్తవికత వైపే మొదట్లో పయనించాయి. నిప్పునీ, నీరునీ, గాలినీ, భూమినీ వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడమే మానవుని అభివృద్ధి సోపానం. నిప్పుని, నీరునీ, గాలినీ, భూమినీ వాటి భౌతిక రూపాలను తెలుసుకోవడానికి ముందు, దాని భౌతిక శక్తిని అర్థం చేసుకోక ముందు వడివడిగా ముందుకు నడవలేకపోయాడు. నిప్పు మానవ సామాజిక పరిణామంలో కీలక పాత్ర వహించింది. నిప్పుని ఆరాధించిన జాతుల కంటే, నిప్పుని భౌతిక శక్తిగా గుర్తించిన జాతులు శక్తివంతంగా ముందుకు నడిచాయి. నిప్పు మానవ జీవితాన్ని ఒక భౌతిక శక్తిగా ప్రభావితం చేసింది. భారతదేశంలో చార్వాకులు నిప్పుకి 'భౌతిక శాస్త్రతత్వాన్ని' రూపొందించారు. నిప్పునారాధించే జాతులకీ, నిప్పుని అధీనం చేసుకొన్న జాతులకీ భారతదేశంలో సమరం జరిగింది. తన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచాన్ని సమన్వయించుకోవడంలో విఫలమైనవారు భావవాదులుగా రూపొందారు. వీరు భౌతిక సామాజిక వాస్తవికతకు భిన్నమైన భావవాదంతో భౌతికవాదులకెదురు నిలుస్తూ వచ్చారు. నిప్పుని పదార్థంగా కనుగొన్న చార్వాకుల వారసులు భారతీయ ఆదిమ జాతుల వారే. అడవులు తగులబెట్టి పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనుల పరిణామం నుండి వ్యవసాయ సంస్కృతిని రూపొందించి నిప్పుని భౌతిక శక్తిగా వాడుకున్నారు. వేదాలు భారత దేశానికి వలస వచ్చిన రాజకీయ తెగలైన ఆర్యులు రూపొందించుకున్న భావజాలం. ఈ వేదాలు క్రీ.ఎ.పూ.ఎ 2000–750 సంవత్సరాల మధ్యలో రచించబడినాయని వింటర్‌నిట్జ్ పేర్కొన్నాడు. కీత్ క్రీ.ఎ.పూ.ఎ 1200–350 సంవత్సరాల మధ్యలోవని తెలిపాడు. సాధారణంగా వేద రచన క్రీ.పూ 1400 ప్రాంతంలో ప్రారంభమై క్రీ.ఎ.పూ 600 వరకు జరిగిందని చరిత్రకారులు భావిస్తున్నారు. వేద శబ్దమునకు "జ్ఞానము"ని అర్థం ఇవ్వబడింది. జైమిని అభిప్రాయం ప్రకారం వేదాలు రెండు భాగాలు. 1. మంత్రాలు 2. బ్రాహ్మణాలు. మంత్రాల సంకలనాన్ని సంహితలని అంటారు. ఋగ్వేదానికీ, యజుర్వేదానికీ, సామ వేదానికీ, అధర్వణ వేదానికీ, సంహితలున్నాయి. ఇవి ఒకరి నోటి నుండి ఒకరు కంఠస్థం చేశారు. అందుకే వీటిని శృతులు అన్నారు. వేదాలను సంహితులుగానే కాక బ్రాహ్మణాలుగా, అరణ్యకాలుగా కూడా విభజించారు. నాలుగు వేదాల్లో అతి పురాతనమైంది ఋగ్వేదం. ఋగ్వేద మంత్ర కర్తలలో విశ్వామిత్రుడు, వశిష్టుడు, భరద్వాజుడు, గౌతముడు ముఖ్యులు. వీరు క్రీ.ఎ.పూ 1500 ప్రాంతం వారీగా గుర్తింపబడ్డారు. ఋగ్వేదం క్రీ.ఎ.పూ 1520 ప్రాంతం నుండి క్రీ.ఎ.పూ 1420 దాకా వివిధ ఋషుల చేత రాయబడుతూనే ఉంది. ఋగ్వేదంలో అగ్ని, వరుణుడు, సూర్యుడు, ఇంద్రుడు మొదలైన దేవతలను కొనియాడారు. నిజానికి చార్వాక వాదం, జైనవాదం, బౌద్ధవాదం, సాంఖ్య తత్వశాస్త్రం బోధించబడితే విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు భారతదేశంలో తాత్విక మూలాలు అర్థం అవుతాయి. దానివల్ల దేశంలో వైజ్ఞానిక, శాస్త్రీయ, సాంకేతిక జ్ఞానం పెరుగుతుంది. అయితే బిజెపి, ఆర్‌యస్‌యస్, విశ్వహిందూ పరిషత్‌ల భావజాలాలు చొప్పించాలని చూస్తున్నారు. ఇది దేశానికి మంచిది కాదు. భారత దేశం ఒక మతానికి సంబంధించినది కాదు. ఒక వర్ణాధిపత్యానికి లోబడదు. ఇది లౌకికవాద భావజాలంతో కూడినది. భారతదేశ భౌగోళిక పరిస్థితుల నుంచి అనేక ఉపఖండాల నుండి మన దేశానికి వలస వచ్చిన పాలకులు భిన్న మతాలను తీసుకు వచ్చారు. వైదికం, ఇస్లాం, క్రైస్తవం బయట నుండి వచ్చినవే. చార్వాకం, బౌద్ధం, జైనం, సాంఖ్యం దేశీయంగా పుట్టిన తత్వాలు, ధర్మాలు. అవి ఆ తరువాత మతాలుగా పిలువబడ్డాయి. అందుకే ఈనాడు భారతీయ తాత్విక బోధన ద్వారా విద్యార్థులను, పరిశోధకులను, రాజకీయవేత్తలను ప్రభావితం చేయాలంటే భారతీయ భౌతికవాద చింతన తప్పక జరగాలి. నీటిని కల్మషం చేసే కుంభమేళాలు భారతదేశ సంస్కృతి కాదు. ఇవి వ్యవసాయ సంస్కృతికి, పారిశ్రామిక విధానాలకు వ్యతిరిక్తమైనవి. మనిషిని మూఢ విశ్వాసాల్లోకి నెట్టి జ్ఞాన శూన్యం చేస్తాయి. తాత్విక జిజ్ఞాస నుండి కర్మకాండల్లోకి నెడతాయి. ఇవి పితృస్వామిక భావజాలంతో నడుస్తున్నాయి. ఇవి యువతను పక్కదారి పట్టిస్తున్నాయి. యువతను లైబ్రరీలకు, పరిశోధనలకు, రచనలకు, సృజనానికి, కళాసృష్టికి వెళ్లకుండా నిరోధిస్తున్నాయి. అందుకే, భారతదేశంలో నూతన సామాజిక తాత్విక విప్లవం నేటి అవసరం. ఆ దిశగా పయనిద్దాం.

# తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టులు!



**అదిలాబాద్,తెలంగాణ దిశ:** విమానాశ్రయం ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఆదిలాబాద్ వాసుల కలలు త్వరలోనే ఫలించబోతున్నాయి. ఆదిలాబాద్‌లోని రక్షణశాఖకు సంబంధించిన వైమానిక విమానాశ్రయంలో.. పౌరవిమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని, దీంతో పాటు.. పౌర విమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు ఆయన క్లారిటీ ఇచ్చారు. స్థానిక ప్రజలు, పలు పార్టీల నాయకుల నుంచి కొంతకాలంగా వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 29 జనవరి, 2025 నాడు లేఖ రాశామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. వ్యక్తిగతంగా కలిసి ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూములను ప్రజావసరాలకు సద్వినియోగం చేసేలా చొరవ తీసుకోవాలని కోరామని అన్నారు. దీనిపై వారు రక్షణ శాఖ అధికారులతో చర్చించిన తర్వాత సానుకూల నిర్ణయాన్ని తెలియజేస్తూ నిన్న లేఖ రాశారని చెప్పుకొచ్చారు. రాజ్‌నాథ్ సింగ్ సానుకూల స్పందనను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందుకుగానూ ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నామని చెప్పారు. 'పత్తి వ్యాపారానికి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు ఆదిలాబాద్ ప్రధానమైన కేంద్రంగా ఉంది. దీంతోఆదిలాబాద్ తో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల నుంచి.. విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసే విషయంలో చొరవ తీసుకోవాలని దశాబ్దాలుగా డిమాండ్ వినిపిస్తోంది. దీనిపై నేను 7 జూలై 2022,15 ఫిబ్రవరి 2023నాడు నాటి ముఖ్యమంత్రికి లేఖలు రాశాం. ఐదేళ్లుగా ఈ విషయంపై పదే పదే నేను ప్రస్తావించాను. అయినా రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'అటు, ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే విమానయాన సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభిస్తామని 2021 అక్టోబర్ లో నాటి పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా నాటి సీఎంకి లేఖ రాశారు. కానీ దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. కానీ ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని.. వారి నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని.. నేను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో, పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడుకి లేఖలు రాయ డంతో పాటుగా వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేశాను' అని చెప్పారు. వరంగల్ విమానాశ్రయానికి అనుమతులు లభించడం తో.. విమానా శ్రయం ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేసి ఇస్తే.. ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు కూడా వేగవంతం చేసేందుకు వీలవుతుంది. తద్వారా వీలైనంత త్వరగానే.. వరంగల్ ప్రజల స్వప్నం సాకారం కానుంది. గత నెలలో.. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటు, ఇందుకు సంబంధించిన పురోగతి తదితర విషయాలను నేను, రామ్మోహన్ నాయుడు సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించాం' అని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. రీజనల్ కనెక్టివిటీ స్కీమ్ ? ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ పథకంలో భాగంగా.. దాదాపు 620 రూట్లలో ఇప్పటికే హైదరాబాద్‌కు 60 రూట్స్ (10%) ఆపరేషన్‌లో ఉన్నాయి. వరంగల్, ఆదిలాబాద్‌లో కూడా విమానాశ్రయాల సేవలు ప్రారంభిస్తే తెలంగాణకు ఉడాన్ కింద మరికొన్ని రూట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇది ప్రజల ప్రయాణంతో పాటుగా.. ఈ ప్రాంతంలో వాణిజ్యాభివృద్ధికి కూడా తోడ్పడనుంది' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఆదిలా బాద్‌లో గతంలోనే విమానాశ్రయం ఉ ండేది. దీన్ని సైనిక అవసరాల కోసం మాత్రమే వినియోగించేవారు. కాలక్రమేణా.. వివిధ కారణాలతో రక్షణ శాఖ కార్యకలాపాలు కూడా ఆగిపోయాయి. ఇప్పుడు ఈ విమానాశ్రయాన్ని తిరిగి యాక్టివేట్ చేయడం రక్షణశాఖకు, పౌర సేవలకు ఎంతో ఉపయోగపడనుంది.

# వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకే..!?

చారిత్రాత్మక రైతు ఉద్యమం జరిగి మూడు సంవత్సరాలు దాటింది. 13 మాసాల పాటు ఢిల్లీ పరిసరాలు కేంద్రంగా దేశవ్యాప్తంగా జరిగిన పోరాటం ముగింపు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఎస్‌కెఎమ్ నాయకత్వానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. అప్రజాస్వామి కంగా తెచ్చిన మూడు చట్టాలు రద్దు చేస్తామని, సి2ం50 శాతం మద్దతు ధరలు చట్టం చేస్తామని, విద్యుత్ చట్ట సవరణ బిల్లు రైతు సంఘాలతో చర్చించి నిర్ణయిస్తామని, ఉద్యమం సందర్భంగా అసువులు బాసిన రైతు కుటుంబాలకు పరిహారం ఇస్తామని ఎస్‌కెఎమ్ నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చింది. చట్టాలను వెనక్కి తీసుకుంది. మిగతా హామీలను అమలు పరచకుండా మూడు చట్టాల రూపకర్తలతోను, ఆ విధానాల మద్దతుదారులతోనూ కమిటీని ఏర్పాటు చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాలన్నిటిలో అదానీ, అంబానీ కంపెనీల ఉద్యోగులను సలహాదారులుగా నియమించింది. మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం కొత్తగా మూడు పథకాలను ప్రకటించింది. ఈ మూడు పథకాల సారాంశం మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే ధ్యేయంగా ఉన్నాయి. వాస్తవానికి రద్దయిన చట్టాల కన్నా ఘోరంగా ఉన్నాయి. ఈ స్థితిలో ఎస్‌కెఎమ్ నాయకత్వం మరొక దీర్ఘకాల ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నది. ఈ క్రమంలో రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 14న చర్చలకు సిద్ధమయింది. డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్: డిజిటల్ రంగంలో విద్య, ఆరోగ్యం, ఆర్థిక, రిటైల్ రంగాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని పేర్కొంది. సాంప్రదాయ వ్యవసాయాన్ని సాంకేతిక వ్యవసాయంగా మార్చడం లక్ష్యంగా ప్రకటించింది. మన వ్యవసాయ రంగం ప్రపంచంలో పాడి, జ్యూట్ పప్పుధాన్యాలు ఉత్పత్తిలో మొదటి స్థానంలో, గోధుమ, వరి, వేరుశనగ, కూరగాయలు, పళ్ళు, పత్తి, చెరకు ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉన్నప్పటికీ%ో%చిన్న కమతాల వల్ల సరిపడా ఆదాయం రావడంలేదని పేర్కొంది. వాతావరణ సస్యరక్షణ, సాగునీటి వ్యవస్థ, అధిక ఎరువుల వాడకం సమస్యలు ఎదుర్కొంటున్నదని డిజిటల్ టెక్నాలజీతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని పేర్కొంది. ప్రతి గ్రామంలో బకెటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని అందులో రైతులందరినీ గ్రూప్‌గా ఏర్పరచాలని చెప్పింది. మూడు సంవత్సరాలలో 11 కోట్ల కుటుంబాలను ఈ గ్రూపుల్లో చేర్చడమే లక్ష్యంగా పేర్కొంది. రైతులందరినీ ఒకే గొడుగు కిందకు చేరుస్తుంది. ఈ గొడుగులన్నీ కార్పొరేట్ కంపెనీల అజమాయిషీలోనే వుంటాయి. వ్యవసాయ కార్యకలాపాలన్నీ కంపెనీల అజమాయిషీలోనే నిర్వహించాల్సి వుంటుంది. పేద, మధ్య తరగతి రైతాంగం యావత్తూ కంపెనీలకు బంధీలైపోతారు. రైతులకు అగ్రి స్టాక్ కార్డులు ఇవ్వాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, పశుపోషణ, భూమి సారాలు, వాతావరణ ఫోర్ కాస్ట్, భూమిలో తేమ శాతం, క్రిమి కీటకాల ప్రభావం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంట్స్ అన్నీ దీని ద్వారా నిర్వహించాలని పేర్కొన్నది. ట్రాక్టర్లు, డ్రోన్లు, హార్వెస్టర్లు తదితర అగ్రికల్చరల్ రోబోట్లను ప్రవేశపెట్టాలని పేర్కొంది. భూములన్నీ ఏకీకృతం చేయడం లక్ష్యంగా ఉంది. ఇవన్నీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే తప్ప వేరుగాదు.

రెండు దశాబ్దాలకు పూర్వం కుప్పంలో ఇజ్రాయిల్ కంపెనీతో చేసిన ప్రయోగం తప్ప వేరు కాదు. నేషనల్ కోపరేటివ్ పాలసీ: రాష్ట్రాల జాబితాలో ఉన్న సహకార రంగాన్ని కేంద్రం పరిధిలోకి తీసుకున్నది. సహకార మంత్రిత్వ శాఖను ఏర్పరిచింది. జాతీయ సహకార పాలసీని ప్రకటించింది. గ్రామాలలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బహుళ ప్రయోజన ప్రాథమిక సహకార సంఘాలుగా మారుస్తుంది. ఇప్పటివరకు స్వతంత్ర సహకార సంఘాలుగా పని చేస్తున్న పాల సహకార సంఘాలను, మత్స్య సహకార సంఘాలను వీటితో సంధానం చేస్తుంది. వీటిని ప్రతి పంచాయతీ పరిధిలోనూ ఏర్పాటు చేస్తుంది. ఈ సంఘాలు సామాజిక వ్యవసాయం, పాలు, చేపలు, పరపతి, గోడౌన్లు ఏర్పాటు, ధాన్య సేకరణ, ఎరువులు, విత్తనాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ బంకులు, మందుల షాపులు ఏర్పాటు చేస్తాయి. కామన్ సర్వీస్ సెంటర్లు, మైక్రో ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పు తాయి. రోబోట్ యంత్రాలు, యంత్రాల హైరింగ్ సెంటర్లు, సోలార్ పరికరాలు ఏర్పాటు చేస్తాయి. ఈ సహకార సంఘాలలో వ్యవసాయం చేసే రైతులు, పాలు పోసే రైతులు, చేపలు పెంచే రైతులు సభ్యులుగా ఉన్నారు. సంఘంలో ఎంత షేరు ధనం ఉన్నా ఒక్కొక్కరికి ఒక్కొక్క ఓటు ఉంటుంది. నూతన చట్టం ప్రకారం ఈ సంఘాలలో ఈ మూడు రంగాలతో వ్యాపారం చేసేవారు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నడిపేవారు, పెట్టుబడులు పెట్టేవారు "ఎ" తరగతి సభ్యులుగా చేరవచ్చు. వీరు 20 శాతం షేరు ధనం కట్టవచ్చు. ఓటింగ్ హక్కు కూడా 20 శాతం ఓట్లు ఉంటాయి. వ్యవసాయం చేసే రైతుకు, పాలు పోసే రైతుకు, చేపలు పెంచే రైతుకు ఒక్కొక్కరికి ఒక్కొక్క ఓటు మాత్రమే ఉంటుంది. ఈ సొసైటీలన్నీ వ్యాపారుల, ప్రోసెసింగ్ యూనిట్ యజమానుల, పెట్టుబడిదారులు అయిన అదానీ, అంబానీ, బేయర్, డూపాండ్, మాన్‌సాంటో, ర్యాలీస్ వంటి వాటి వశం అవుతాయి. ఈ సొసైటీలన్నిటికీ వారి ప్రయోజనాలే ప్రధానం అవుతాయి. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే ఆర్థిక సంస్థలన్నీ ఈ పథకానికి మద్దతుగా ఉంటాయి. ఇప్పటికే కంపెనీ యాక్ట్‌లోకి వెళ్ళిన విశాఖ డెయిరీ ఎలా నడుస్తున్నదో చూస్తూనే ఉన్నాం.

# కుప్పకూలిన నిర్మాణ రంగం



## మళ్లీ గల్ఫ్ గమ్యమవుతున్నది
## ఆరునెలలుగా పనిలేక వడ్రంగి యాతన
## తప్పని పరిస్థితిలో ఉపాధి కోసం గల్ఫ్ బాట

**సిరిసిల్ల,తెలంగాణ దిశ :** వ్యవసాయం, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం ఒకదా నితో ఒకటి ముడిపడిన రంగాలు. ప్రస్తుత ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ప్రతి రంగం కుదేలైం ది. దీంతో కార్మికులు, వృత్తిదారులు, యువకులు తిరిగి గల్ఫ్‌బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వడ్రంగి కొడిమోజు దేవేందరే ఉదాహరణ. ఏడేండ్లుగా చేతినిండా వృత్తి పనితో సంతోషంగా గడిపిన దేవేందర్‌కు భార్య లహరి, ఇద్దరు పిల్లలు సాత్విక్, సుచిత్ ఉన్నారు. పిల్లలను ఉన్నంతలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తూ ఉన్న ఊళ్లో సంతోషంగా బతకాలని కలలుగన్నాడు. ఇంతలో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మార డం.. రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గుముఖం పట్టడం.. ఫలితంగా నిర్మాణ రంగం ఆగమైంది. దీనికితోడు ఇసుకపై విపరీతమైన ఆంక్షలు విధించడంతో ఇండ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆరు నెలలుగా పనిలేక ఇబ్బందులు పడుతున్నాడు. అద్దెకు తీసుకుని నడిపిస్తున్న కార్పెంటర్ షెడ్డుకు అద్దె చెల్లించడం, పిల్లల చదువులకు ఫీజులు కట్టడం, కుటుంబాన్ని పోషించడం తలకు మించిన భారంగా మారింది. 2006లో ఊళ్లో పనిలేక బహరాన్, 2015లో సౌదీలో గడిపిన దేవేందర్.. ఆ తర్వాత సొంత ఊళ్లో పని ఉన్నదని 2017లో స్వగ్రామానికి చేరుకున్నాడు. 7 సంవత్సరాలు సంతోషంగా గడిపాడు. మళ్లీ ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో మస్కట్ బా ట పడుతున్నాడు. భార్యాపిల్లలను విడిచి వెళ్లాలని లేకపోయినా వెళ్లక తప్పడం లేదని దేవేందర్ ఆవేదనగా తెలిపాడు.

# టారిఫ్‌లు, ఆర్బీఐ సమీక్షపైనే దృష్టి

దేశీయ స్టాక్ మార్కెట్లు గతవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలతో ఉలిక్కిపడ్డాయి. వరుస నష్టాల నుంచి సూచీలు కోలుకుంటున్న తరుణంలో టారిఫ్‌ల పిడుగు వచ్చిపడింది. ప్రపంచవ్యాప్తంగా ఇది వాణిజ్య యుద్ధానికి దారితీయగా.. మదుపరుల భయాల నడుమ ఈక్విటీ మార్కెట్లు అంతటా కుప్పకూలిపోయాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,050.23 పాయింట్లు లేదా 2.64 శాతం పతనమై 75,364.69 వద్ద నిలిచింది. అలాగేనేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ)సూనిఫ్టీ 614.80 పాయింట్లు లేదా 2.61శాతం క్షీణించి 22,904.45 దగ్గర స్థిరపడింది. ఈనేపథ్యంలోఈ వారం కూడా ట్రేడ్ వార్ భయాలు మార్కెట్లను వెంటడుతాయని, ఆయా దేశాలు అమెరికా టారిఫ్‌లపై స్పందించే తీరే కీలకమని మెజారిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే చైనా దీటుగా స్పందించింది. తమ దేశంలోకి వచ్చే అమెరికా వస్తూత్పత్తులపై 34 శాతం అదనపు సుంకాలుంటాయని ప్రకటించింది. ఈ క్రమంలో మరికొన్ని దేశాలూ ఇదే దిశగా వెళ్తుండగా, ఇంకొన్ని దేశాలు అమెరికాతో చర్చలకు ప్రయత్నిస్తున్నాయి. ఇక ఈ విషయంలో భారత్ ప్రతిస్పందన కూడా స్టాక్ మార్కెట్లకు దిశా-నిర్దేశం చేయగలదు. ఇదిలావుంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష కూడా కీలకమే. ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయాలుంటాయి. గత సమీక్షలో చాలాకాలం తర్వాత రెపోరేటును పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి కూడా వడ్డీరేట్ల కోత ఉంటుందన్న అంచనాలే నెలకొన్నాయి. ఇదే జరిగితే ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్లకు కొత్త ఉత్సాహం లభించినట్టే అనుకోవచ్చు. అలాకాకపోతే మాత్రం సూచీలు మరింత దిగజారే అవకాశాలే ఎక్కువ. మదుపరులపై అమ్మకాల ఒత్తిడి కొనసాగవచ్చు మరి. ఇక డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత




మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు.కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,600పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,400 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,200-23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ,విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుం టాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం.

పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మాపత్రిక ఎటు వంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# కోట్ల ఆస్తిని వదిలేసి.. సన్యాసం

గాంధీనగర్: గుజరాత్ లోని నగరానికి చెందిన జైన్ బ్లాక్‌కు చెందిన నరేంద్ర గాంధీ, సంగీత గాంధీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో, ఇప్పుడు 26ఏళ్ల కుమార్తె నికితా విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకుంది. నరేంద్ర గాంధీ ఒక కోటీశ్వరుడు. గొప్ప ధనవంతు డు. అయితే,ఇప్పుడు బిలియనీర్ కుమార్తె నికితా సిరి తన సంపదను వదులుకుంది. నికిత గత ఏడు సంవత్సరాలుగా సన్యాసి కావాలని కోరుకుంది. ఆమె కోరిక ఇప్పుడు నెరవేరింది.నికిత సన్యాసం స్వీకరించా లని నిర్ణయించుకోవడంతో, ఆమె బంధువులు యాద్గిర్‌లో గొప్ప ఊరేగింపు నిర్వహించారు. వివిధ సంగీత వాయిద్యా లతో ఊరేగింపు జరిగింది, మొత్తం జైన సమాజం అందులో పాల్గొంది.

నికితా ఇకపై ఎలాంటి వస్తువులను ఉపయోగించనందున ఊరేగింపు సమయంలో ప్రజలకుకొత్త దుస్తులతో సహావివిధవస్తువులను విరాళంగా ఇచ్చింది. ప్రమాణాలు అంగీకరించిన తర్వాత, అత్యంత కష్టతరమైనమార్గాన్ని తీసుకోవాలి. బూట్లు ధరించకూడదు, రవాణా కోసం ఎటువంటి వాహనాలను ఉపయోగించకూడదు. మీరు ఒకే చోట రెండు రోజుల కంటే ఎక్కువ ఉండకూడదుతెల్లని, శుభ్రమైన బట్టలు ధరించాలి. రోజువారీ నడక జీవితాన్ని గడపాలి.సన్యాసం స్వీకరించిన తలవెంట్రుకలను బ్లేడు ఉపయోగించకుండా చేతితోనే గుండు చేయించుకుంటారు. నికితా ఇంత కష్టతరమైన జీవితాన్ని ఎంచుకుంది. నాన్న ధనవంతుడు అయినప్పటికీ, అవన్నీ వదిలేసుకుంది.

తన కుటుంబాన్ని, బంధువులను విడిచిపెట్టి సన్యాసిగా మారడం గురించి మాట్లాడిన నికిత, "గురుకులవాసికి వెళ్లడం నాకు సంతోషంగా ఉంది" అని అన్నారు. అన్నీ వదిలి వెళ్ళడం పట్ల నాకు ఎలాంటి బాధ లేదు అని, నేను చాలా సంతోషంగా ఉన్నాను" అని నికిత వెల్లడించింది. భగవంతుడు మహావీరుడు చెప్పినట్లుగా,నా ఆత్మ పరమాత్మగా మారాలని కోరుకుంటుంది, అందుకే నేను ఈ మార్గాన్ని ఎంచుకునాను.

చాలా కాలంగా, నా తండ్రితో సహా మొత్తం కుటుంబం నాకు కారు, బైక్‌తో సహా నేను అడిగినవన్నీ ఇచ్చింది.కానీ,"నాకు ఇప్పుడు అందులో ఏవీవద్దు"అని నికిత పేర్కొంది. ఏడుసంవత్సరాల క్రితం,నేనుఈ జీవితం వద్దుఅని నిర్ణయించుకున్నాను. అందుకే,నేను సన్యాసి కా వాలని నిర్ణయించుకున్నాను. కానీ,తల్లిదండ్రులు మొదట్లో ఒప్పుకోకపో యినా వారినిఒప్పించి, 7సంవత్సరాల తర్వాత, నేను పరమాత్మ మా ర్గంలో నడిచేందుకు సిద్ధం అయ్యానని చెప్పింది.

# రిజిస్టర్ సారూ ఎస్ఆర్ఓ లపై ఓ కన్నేయండి...

## ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న ఎస్ఆర్ఓ కార్యాలయాలు..?- చక్కదిద్దకపోతే అంతే సంగతి..!




**వరంగల్,తెలంగాణ దిశ :** "కంచె చేను మేసిన చందంగా "జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయా లు తయారయ్యాయని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడివరంగల్ జిల్లారిజిస్టర్ సారుఓకన్నెయ్యండని ప్రజలు కోరుతు న్నారు సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో అవినీతి నిర్మూలించి పారద ర్శకమైన సేవలను అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఎన్నో రకాలైన చర్యలను చేపట్టింది అయినప్పటికీ ఆ చర్యలు క్షేత్రస్థాయిలో పనిచేయటం లేదన్న అప్ప వారు జిల్లాలో నెలకొందని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశించినప్పటికీ సబ్ రిజిస్ట్రార్లు వాటిని తుంగలో తొక్కి ఇష్టారీతిన ప్రజల వద్ద నుండి మామూలు గుంజుతున్న వైనంఇటీవల చర్చగానియాంశంగా మారింది గత కొన్ని నెలలుగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్టర్ అధికారులు పలు అవినీతి కేసులలో ఏసీబీ అధికారులకు చెక్కి జైలు పాలైన విషయం జిల్లా ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు ఉమ్మడి జిల్లాలోని పరకాల మహబూబాబాద్ స్టేషన్ ఘన్పూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విధులను నిర్వహించిన అధికారులు లంచాల స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారుల చేతికి చిక్కి జైలుకెళ్ళిన విషయం అటు ప్రజల్లో ఇటు అధికారులు కలవరపాడుకు గురిచేస్తుంది వరంగల్ పోర్ట్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కొద్ది రోజులపాటు విధులు నిర్వహించిన సబ్ రిజిస్టర్ అధికారి నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే అవినీతి కేసులో సస్పెండ్ అయ్యారు దీంతో వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న సబ్ రిజిస్టర్ల వ్యవహార సరళి ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది వివిధ కార్యాలయంలో పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లు వారి వ్యవహార సరళనిమార్చుకోకుండా ఇష్టారాజ్యంగా పనిచేయడం వలన కార్యాలయాలుఅవినీతికి కేంద్రాలుగా మారిపోయాయని ప్రజలు అంటున్నారు వారికి చెందిన ప్లాట్ల క్రయవిక్రయాల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా మామూళ్లకు ఆశపడి స్టార్లు పనిచేయడం వల్ల కార్యాలయాలలో అవినీతి బాగోతం పెచ్చుమీరి పోయిందని అంటున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఎస్ఆర్ఓల వ్యవహార సరలితో అబాసు పాలవుతున్న సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఓ కన్నేసి ఉంచాలని జిల్లా ప్రజలు రిజిస్టర్ కోరుతున్నారు ఎంతోమంది సబ్ రిజిస్టర్లు పలు అవినీతి కేసుల్లో జైలు పాలు అయినప్పటికీ మిగిలిన వాళ్ళలో ఎలాంటి మార్పు రాకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు సబ్ రిజిస్టర్ కార్యాలయాలు అవినీతికి నిలయంగా మారి కంపుకోడుతున్నాయని , ఇప్పటికైనా కార్యాలయాలలో అవినీతి రహితంగా మార్చాలంటే స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌చేస్తున్న అధికారులను గుర్తించి కఠినమైన శిక్షలు విధించా లనిప్రజలు కోరుతున్నారు కార్యాలయానికి వచ్చే వారి వద్ద నిబం ధనలకు విరుద్ధంగా ఉన్న క్రయవిక్రయాలను నిలుపుదల చేసినట్లయితే బాగుంటుందన్నారు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసి అక్రమంగా సంపాదించడం వలన సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ప్రజల్లో చులకన అవుతున్నాయని అంటున్నారు జిల్లాలోనిఎస్ ఆర్ఓకార్యాలయాలలో ఎల్ఆర్ఎస్ అసెస్మెంట్ మార్టి గేజ్ లాంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతున్నప్పటికీ కొంతమంది అధికారులు కార్యాలయానికి వచ్చేవారి వద్ద నుండి ఎక్కువ మొత్తం లోమామూలు డిమాండ్ చేయడం వినిపిస్తుందని ఆపద్ధతిని మానుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో ఇటీవల నర్సంపేట వరంగల్ పోర్ట్ హనుమ కొండ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు అధికారులపై అవినీతి ఆరోపణలు జోరుగా వినిపించాయి ఈ క్రమంలో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు అవినీతి అరకట్టకపోతే కార్యాలయా లు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నా యని అంటున్నారు. జిల్లాలోని కొన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న ప్రైవేటు ఉద్యోగులను తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ ఎస్ ఆర్ ఓ లు పట్టించుకోవడం లేదని తెలిసింది జిల్లా రిజిస్టర్, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి ఆదేశాలను ఎస్ఆర్వోలు పాటించడం లేదని ప్రచారం జరుగుతుంది

# హైదరాబాద్‌లో అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్

## 199.12 ఎకరాల్లో నిర్మించడానికి ప్రతిపాదనలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న ఉద్యాన పంటలను దృష్టిలో ఉంచుకుని, అలాగే భవిష్యత్తులో పండ్ల ఎగుమతి, దిగుమతులకు తగ్గట్లు.. అత్యాధునిక సౌకర్యాలతో, అంతర్జాతీయ స్థాయిలో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. హైదరాబాద్ శివార్లలోని కొహెడలో రూ.1,901.17 కోట్లతో 199.12 ఎకరాల్లో అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్ నిర్మించడానికి ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. మార్కెటింగ్‌శాఖ డీటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)ను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం అనంతరం పనులు మొదలుకానున్నాయి. 1986లో హైదరాబాద్‌లోని కొత్తపేటలో 22 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేశారు. రద్దీ సమస్య దృష్ట్యా దాన్ని 2021లో కొహెడకు తరలించారు. తాత్కాలిక షెడ్లను నిర్మించగా వర్షాలు, గాలికి కూలిపోయాయి. దీంతో మార్కెట్‌ను బాటసింగారం హెచ్ఎండీఏ లాజిస్టిక్ పార్కులోకి మార్చారు. ఇప్పుడు కొహెడలో ఏకంగా 199 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నడుంబిగించింది. ప్రస్తుతం ఢిల్లీలో 100 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ ఉంది. కొహెడలో మార్కెట్ నిర్మాణం పూర్తి అయితే.. ఢిల్లీని మించి దేశంలోనే అతి పెద్ద ఫ్రూట్ మార్కెట్‌గా హైదరాబాద్ నిలుస్తుంది. 48.71ఎకరాల్లో పండ్ల వ్యాపారానికి అవసరమైన మౌలిక వసతులను నిర్మిస్తారు. రోడ్ల కోసం 56.05 ఎకరాలు కేటాయించారు. టోల్‌గేట్, నాలా, గ్రామరోడ్డు వంటివాటికి 17.27 ఎకరాలు, పార్కింగ్ స్థలానికి 16.59 ఎకరాలు కేటాయిస్తారు.

పూలు,డ్రై ఫ్రూట్స్, పాడి, చేపలు, పౌల్ట్రీ, మాంసం, ఫ్రోజెన్, ప్యాక్డ్ బాటిల్ ఫుడ్స్ వంటి ఉత్పత్తులకు 10.98,కోల్డ్‌స్టోరేజీలకు 9.50 ఎకరాలు కేటాయి ంచనున్నారు. వీటితో పాటు.. పండ్ల రిటైల్ జోన్, సామగ్రి నిల్వ, ప్రాథమిక శుద్ధి,వివిధ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పరిపాలన భవనం, ప్రయో గశాలలు, విశ్రాంతిగృహాలు, అగ్నిమాపక, పోలీసుస్టేషన్, ఆరోగ్యకేంద్రం, దుకాణాల సముదాయం, ఘనవ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి నిర్మాణాలు చేపడతారు.

వంద అడుగుల ఎత్తులో 19,375 చదరపు అడుగుల స్థలంలో నిర్మించే టవర్‌ఆఫ్ ఎక్సలెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందులో 4 అంతస్తులను వ్యాపార సంస్థలకు కేటాయిస్తారు. ఆరు హై-స్పీడ్ ప్యాసింజర్ లిఫ్ట్‌లు, హెలిప్యాడ్‌లు ఉంటాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య, ఎగుమతి సంస్థలకు లీజుపై స్థలాలను కేటాయించనున్నారు. రూ.350కోట్లను భూసేకరణకు వెచ్చిస్తున్నారు. రూ.1,694.74 కోట్లతో నిర్మాణ పనులు, ఐటీ సౌకర్యాలు కల్పిస్తారు.

# టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న మహిళా సంఘాలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వ్యవసాయ సాగు విస్తరణలోపంట తెగుళ్లను నిర్మూలించే పద్ధతిలో మహిళా విభాగం ముందు కెళ్తుంది. డ్రోన్ల సహాయంతో పిచికారి చేస్తూ సేద్యానికి మహిళా మణులు వెన్నుదన్నుగా నిలిచే సమయం రానే వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చినసంక్షేమ పథకం.. నమో డ్రోన్ దీదీ.ఈ పథకం తెలంగాణ రాష్ట్రం లోనే మొదటిగా సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలో అమలు కావడంతో విద్యావంతులైన డ్వాక్రా గ్రూప్ మహిళలు డ్రోన్లతో పిచికారి చేసే శిక్షణ పొందుతూ సబ్సిడీల రూపంలో జీవన ఉపాధి పొందుతున్నారు. రైతులకు డ్వాక్రా మహిళలు అండగా నిలవనున్నారు. వ్యవసాయ పనుల్లో వారికి సాయంగా నిలిచి డ్రోన్ల సాయంతో పురుగు మందులు, ఎరువులు పిచికారి చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నమో డ్రోన్ దీదీ పథకంలో భాగంగా డ్వాక్రా మహిళలను వ్యవసాయ రంగంలో కూడా తీసుకొచ్చి వారికి జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలో ఈ పథకాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రారంభించారు. ఈ పథకంతో విద్యావం తులైన మహిళలకు సబ్సిడీపై డ్రోన్లు అందించనున్నారు. వీటి నిర్వహణపై తొమ్మిది రోజులపాటు శిక్షణ ఇచ్చి వ్యవసాయ పనులు చేయిస్తారు. తొలి విడతగా జిల్లాలో ప్రతి మండలంలోని మూడు డ్వాక్రా గ్రూప్‌లలోని వి ద్యావంతుల్ని ఎంపిక చేస్తారు. వ్యవసాయ దిగుబడి వ్యయాన్ని తగ్గించడం, కూలీల సమస్యల అధిగమించడం,ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మహి ళలకు మారుతున్న

### వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం అవగాహన

టెక్నాలజికి అనుగుణంగా అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలన్న లక్ష్యంతో మహిళలకు ఈ బాధ్యతల్ని అప్పగిస్తున్నారు. దానికి అనుగుణంగా అధికారులు విద్యావంతులైన మహిళల్ని ఎంపిక చేసిన వారందరికీ శిక్షణ అందిస్తున్నారు. వ్యవసాయ రంగానికి ఉత్పత్తి వ్యయం పెరగడంతో రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ఎక్కువ ఖర్చు కూలీలు, ఎరువులు, మందులకే సరిపోతుంది. వీటితో పాటు కొన్ని సమయాల్లో పొలాల్లో మందులు పిచికారి చేసేందుకు కూలీలు సైతం చిక్కడం లేదని రైతులే పిచికారి చేసుకుని అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల వ్యవసాయ రంగంలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం డ్రోన్లను తయారు చేసి వాటిని రైతులకు అందించి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని భావించింది. దానికి అనుగుణంగా నమో డ్రోన్ దీదీ పథకాన్ని ప్రవేశ పెట్టిన కూటమి ప్రభుత్వం బయట వ్యక్తులకు కాకుండా మహిళల్ని వ్యవసాయ రంగానికి తీసుకొచ్చి వారికి జీవనోపాధి అవకాశాలు పెంచాలని భావించి ఈ బాధ్యతల్ని డ్వాక్రా మహిళలకు అప్పగిస్తే సమర్థవంతంగా నిర్వహిస్తారని ప్రభుత్వం ఆలోచించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇక మహిళలకు అందించే డ్రోన్ల ఖరీదు రూ.10లక్షలు విలువ చేస్తుంది.. 80శాతం ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తుందని అంటే రూ. పది లక్షల్లో మహిళలు రెండు లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ.8లక్షలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని దాన్ని తిరిగి చెల్లించనవసరం లేదు అన్నారు.

# అనంతగిరిలో 500 ఏళ్ల నాటి శిలాశాసనాలు

**వికారాబాద్,తెలంగాణ దిశ :** భారత దేశం అనేక సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారా లకు పుట్టినిల్లు. దేశాన్ని పాలించిన అనేక మంది రాజులు దేశ న్నత్యాన్ని చాటిచెప్పారు. అయితే వాటికి సంబంధించిన ఆనవాళు అప్పుడప్పుడు బయట పడుతున్నాయి. తాజాగా తెలంగాణలోని రాజన్నసిరిసిల్ల జిల్లా అనంతగిరిలోని నరసింహులగుట్ట వద్ద భా రత పురావస్తు సర్వే సంస్థబృందం 1517అఇనాటి 500 సంవత్స రాల పురాతన తెలుగు శిలా శాసనాన్ని కనుగొంది. ఈ శాసనం స్థానిక హిందూ దేవతలను స్తుతిస్తూ, అనంతగిరి కొండపై విష్ణు ఆలయ నిర్మాణాన్ని నమోదు చేస్తుందని అధికారులు వెల్లడించారు. ఈ ఆవిష్కరణ ఆంధ్రప్రదేశ్‌లోని లంకమల రిజర్వ్ ఫారెస్ట్‌లో 800నుండి 2000 సంవత్సరాల నాటి శాసనాలు కనుగొన్న కొన్ని నెలల తర్వాత జరిగింది. ఈ సర్వేలో మెగాలిథిక్ కాలం (ఇనుప యుగం) నాటి శిలా కళాఖండాలు కూడా బయటపడ్డాయి. మూడు శిలా ఆశ్రయాలు కనుగొనబడ్డాయి, వీటిలో ఒకదానిలో జంతువులు, రేఖాగణిత నమూనాలు, మానవ బొమ్మలతో కూడిన చరిత్రపూర్వ చిత్రాలు ఉన్నాయిఈ చిత్రాలు 2500 ఃఅ నుంచి 2వ శతాబ్దం మధ్య కాలానికి చెందినవని, ఎరుపు ఓచర్, కయోలిన్, జంతువుల కొవ్వు, పిండిచేసిన ఎముకల వంటి సహజ పదార్థాలతో రూపొందినవని తెలిపారు. ఇటీవలి కాలంలో ఇది అతిపెద్ద పురావస్తు ఆవిష్కరణగా పరిగణించబడుతోంది. తెలంగాణ రాష్ట్రం శాసనాలు, శిలా కళల పరంగా సుసంపన్నమైన చరిత్రను కలిగి ఉంది. గత ఏడాది వికారాబాద్‌లోని కంకల్ గ్రామంలో చాళుక్య కాలం నాటి మూడు శాసనాలు బయటపడ్డాయి.

రాష్ట్రంలో తెలుగులో తెలిసిన అతి పురాతన శాసనం కీసరగుట్ట శాసనం, అలాగే కరీంనగర్‌లోని బొమ్మలగుట్ట, వరంగల్‌లో 9వ శతాబ్దం నాటి శాసనాలు కూడా ఉన్నాయి.ఈ కొత్త ఆవిష్కరణలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి. అనంతగిరి శాసనం మరియు లంకమల చిత్రాలు ప్రాంతీయ చరిత్రలోని విభిన్న కోణాలను వెలికితీస్తాయి. అ ఐ ఈ పరిశోధనలను కొనసాగిస్తూ, ఈ ప్రాంతాల్లో మరిన్ని ఆసక్తికర విషయాలను కనుగొనే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ శాసనం గురించి ఖచ్చితమైన వివరాలు అంటే దానిలోని కంటెంట్, దాన్ని ఎవరు వేయించారు, లేదా దాని ప్రాముఖ్యత ఏమిటి అనే విషయాలు ఇంకా పూర్తిగా వెల్లడి కాలేదు. ఇది తెలుగు లిపి మరియు భాషా వాడకంలోని పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడవచ్చు.

# యువత చూపు.. మద్యపాన నిషేధం వైపు..!



**ఆత్మకూర్,తెలంగాణ దిశ :** గట్టికల్‌లో మద్య నిషేధానికి కదిలిన యువకులు అర్ధరాత్రి వరకు గొడవలు, ఘర్షణలు, నలభై ఏళ్లకే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని ఇంటిపెద్ద మృతి, చిన్న వయసులోనే వితంతువుగా మారిన మహిళలు, వారిపై పిల్లల భారం, తాగొచ్చి భర్త చేసే అల్లరికి తాళలేక పుట్టింటికి వెళ్లిన భార్య.. ఆలూమగల పంచాయితీలో నలిగిన చిన్నారులు.. ఇవీ పల్లెల్లో విచ్చలవిడి మద్యం విక్రయాలతో కనిపిస్తున్న హృదయ విదారక దృశ్యాలు. పగలూ, రాత్రి మద్యం విక్రయించే గొలుసు దుకాణాలు పచ్చని సంసారాల్లో చిచ్చురేపుతున్నాయి. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఈ ఘటనలను కళ్లారచూసిన యువత మద్యపాన నిషేధం వైపు అడుగులు వేస్తోంది. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలంలో పలు గ్రామాల్లో యువ చైతన్యం మద్యం మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతోంది. మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలో 2015 సెప్టెంబరు 21 నుంచి మద్యపాన నిషేధం అమలులోకి వచ్చింది. తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొని పదో సంవత్సరంలోకి అడుగిడింది. ఈ గ్రామంలోని మహసేన, యువ, వింగ్స్ తదితర యువజన సంఘాల యువకులు ఏళ్లతరబడి పట్టుదలతో కట్టడి చేయడంతోపాటు జరిమానాలు విధిస్తున్నారు. ఇస్తళాపురం గ్రామం స్ఫూర్తితో ఇటీవల అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గట్టికల్, పాతర్లపహాడ్ గ్రామాల్లో మద్యపానాన్ని నిషేధించాలంటూ తీర్మానాలు చేశారు. ఆ తీర్మానం గట్టికల్‌లో ఈ నెల 14 నుంచి, పాతర్లపహాడ్‌లో 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఉద్యమంలో యువజన సంఘాలు అఖిలపక్ష పార్టీలు, అధికారులకు, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా చైతన్యం కోసం ద్విచక్ర వాహన ర్యాలీలు తీశారు. ప్రతి గొలుసు దుకాణానికి వెళ్లి అవగాహన కల్పించి మూసి వేయించారు. గట్టికల్‌లో జైభారత్, సర్దార్, అరుంధతి, కంఠమహేశ్వర, లెనిన్, సర్వోత్తమ్, చైతన్య జ్యోతి, గోల్డెన్‌స్టార్, బంగారుగడ్డ యువజన సంఘాల సభ్యులు ఉద్యమంలో పాలుపంచుకున్నారు. పాతర్లపహాడ్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ యంగ్‌స్టార్ యువజన సంఘం, గోల్డెన్‌స్టార్, కౌండిన్య, నవోదయ యువజన సంఘం యువకులు అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్థులను చైతన్యపరిచారు. మండలంలో ముక్కుడుదేవులపల్లి, తుమ్మలపెన్‌పహాడ్‌లోనూ యువజన సంఘాల ప్రతినిధులు గొలుసు దుకాణాలను మూసి వేయించేందుకు గ్రామపెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

# ఉపాధి ప్రణాళికలు షురూ..!



**భువనగిరి,తెలంగాణ దిశ :** ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కల్పిస్తుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు ఉన్న గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిరుపేదలకు బాసటగా నిలుస్తుంది. పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్టుకాల్వల పనులను చేపట్టారు. ఈ సారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది.ఎంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందు పరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల్లోని 1740 గ్రామ పంచాయతీలలో ఈ నెలాఖరు లోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం వెంటనే గ్రామాల్లో సదరు పనులను ఉపాధికూలీల ద్వారా చేపట్టనున్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల తీరుపై ప్రణాళికల రూపకల్పనకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభి వృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతితో పనులు గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై గాంధీ జయంతి రోజు నుంచి ఈ గ్రామసభల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు వరకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

# పల్లెల్లో దళారులు, దడువాయిల దందామోసపోతున్న పత్తి రైతులు



**ఆత్మకూర్,తెలంగాణ దిశ ::** ఆత్మకూర్(ఎస్)లో తప్పుడు తూకాల వ్యవహారంపై దళారులను నిలదీస్తున్న రైతులు ఇటీవల చివ్వెంల మండలానికి చెందిన ఓ వ్యక్తి, మరో దళారి కలిసి మూసీ ప్రాంతంలోని ఇటుకపహాడ్‌లో పత్తిని కొనుగోలు చేస్తుండగా తూకంలో తేడాలు రావడంతో రైతులు గొడవకు దిగారు. ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన ఓ పత్తి వ్యాపారి చివ్వెంల మండలం గుంజలూరులో ముగ్గురు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేశారు. ఒకసారి 74 కిలోలు తూకం వచ్చిన పత్తి బస్తాను అనుమానంతో రెండోసారి తూకం వేస్తే 81కిలోలకు పెరిగింది. ఏడు కిలోలు తేడా రావడంతో రైతులు ఆగ్రహించారు. కాంటాలను నిలిపేశారు. ఒక్క రోజులో వంద క్వింటాళ్ల పత్తి కాంటా వేస్తే అందులో తప్పుడు తూకం ద్వారా 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు కొన్నవారికి మిగలాలి.' ఇదీ పల్లెల్లో పత్తి కొనుగోలుకు దళారులు అనుసరిస్తున్న విధానం. ఈ మోసంలో తూకం వేసిన దడువాయి రోజూ రూ.5 వేల నుంచి 10 వేల వరకు దక్కితే, లక్షల రూపాయలు దళారుల జేబుల్లోకి వెళ్తున్నాయి. రోజూ ఇదే దందా.. ఇదే మోసం. పర్యవేక్షణ చేపట్టి అడ్డుకునే వారు లేరు. గ్రామాల్లో పత్తి కొంటామంటూ వచ్చే వ్యాపారులు ఆరుగాలం కష్టించి పంట పం డించిన రైతులు నిలువునా ముంచుతున్నారు. ఏళ్లకొద్దీ ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో తప్పుడు కాంటాలతో పత్తి వ్యాపారం మోసం చేస్తూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా విస్తరించుకుం టున్నారు. ముఖ్యంగా తూకంలో మోసం చేసి క్వింటాకు పది కిలోల వరకు రైతుకు తక్కువగా చూపిస్తున్నారు. దళారుల మోసాల కారణంగా రైతులు అప్పులపాలవుతున్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ రెండేళ్లుగా పత్తి వ్యాపారంలో దళారులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. తమకు నమ్మకమైన దడవాయిలను పెట్టుకొని గ్రామగ్రామాన బేరం చేస్తూ కొండి కాంటాలను ఉపయోగిస్తూ కర్షకులను నట్టేట ముంచుతున్నారు. కొండి కాంటాల వల్ల క్వింటాకు ఐదు నుంచి పది కిలోల వరకు రైతుకు తక్కువ తూకం చూపిస్తారు. ఆత్మకూర్(ఎస్) మండలకేంద్రంలో ఆదివారం రెండు వర్గాలుగా మారిన పత్తి దళారులు గ్రామ పంచాయతీలో గొడవ పడ్డారు. గమనించిన స్థానిక రైతులు వారికి ఎదురు తిరిగి కాంటాలలో చేస్తున్న మోసాలపై నిలదీశారు.

# కొలోస్ట్రమ్.. గొప్ప ఫుడ్ సప్లిమెంట్!

కొలోస్ట్రమ్ పేరు మనకు అంతగా పరిచయం లేకపోవచ్చు. కానీ, ఆవు ముర్రుపాలు లేదా జున్నుపాలనే ఇంగ్లిష్‌లో కొలోస్ట్రమ్ అంటారు. దూడకు జన్మనిచ్చిన తర్వాత ఆవు పొదుగు నుంచి కొన్ని రోజులపాటు విడుదలయ్యే ముర్రుపాలను 'ద్రవరూప బంగారం' (లిక్విడ్ గోల్డ్)గా భావిస్తారు. ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, యాంటిబాడీస్ పుష్కలంగా ఉండే ఆవు ముర్రుపాలు మన శరీర కణాల మరమ్మతు, గాయాలు మాన్పడం, రోగ నిరోధక వ్యవస్థ, పొట్ట ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయని వివిధ అధ్యయనాల్లో వెల్లడైంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ముర్రుపాలను భారతదేశంలో వేల సంవత్సరాల కిందటే ఆయుర్వేద వైద్యంలో ఉపయోగించారు. వీటిపై శాస్త్రీయ అధ్యయనం 1799లో క్రిస్టఫ్ విల్‌హెల్మ్ హూఫ్‌లాండ్ నిర్వహించాడు. మన ఆరోగ్యానికి అండగా నిలిచే ఆవు ముర్రుపాలు ఇప్పుడు పొడి, ట్యాబ్లెట్ల రూపంలో సప్లిమెంట్లుగా దొరుకుతున్నాయి. వీటి మేలు గురించి తెలుసుకుందాం.

అథ్లెట్ల ప్రదర్శన మెరుగుపడటానికి, వాళ్లు గాయాల నుంచి త్వరగా కోలుకోవడానికి కొలోస్ట్రమ్ సాయపడుతుంది. కొలోస్ట్రమ్‌లో ఇమ్యునోగ్లోబ్యులిన్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన రోగ నిరోధక వ్యవస్థకు గొప్పశక్తినిస్తాయి. దీంతో మనం ఇన్ఫెక్షన్ల బారినపడే ముప్పు తగ్గుతుంది. రోజుకు ఒకటి చొప్పున కొలోస్ట్రమ్ సప్లిమెంట్ తీసుకునే 79 శాతం మంది లాలాజలంలో యాంటి బాడీస్ మోతాదు పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. అలా ఈ సప్లిమెంట్లు మన శ్వాసనాళాన్ని ఇన్ఫెక్షన్ల బారినపడకుండా నివారిస్తాయట. అంతేకాదు.. కొలోస్ట్రమ్‌లో లాక్టోఫెరిన్, లైసోజైమ్ అనే యాంటిమైక్రోబియల్ (సూక్ష్మజీవి నిరోధక) ప్రొటీన్లు ఉంటాయి. ఇవి ఎన్నో ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి మనకు రక్షణను ఇస్తాయి. అయితే కొలోస్ట్రమ్ సప్లిమెంట్లను పాలంటే అలర్జీ ఉన్నవాళు కొంచెం ఆలోచించి తీసుకోవాల్సి ఉంటుంది. పైగా వీటికి అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) నుంచి అనుమతులు కూడా రాలేదు. ఇక ఈ సప్లిమెంట్లు మోతాదు మించితే కడుపు ఉబ్బరం, డయేరియా లాంటి జీర్ణ సమ స్యలు తలెత్తుతాయి.

# టోకెన్ ఉంటేనే కొనుగోళ్లు..!



**నల్గొండ,తెలంగాణ దిశ :** యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాప్తంగా 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారం భమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వాటిల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం తనిఖీలు చేపడుతోంది. పర్యవేక్షణకు మండల స్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేశారు. అవకతవకల నివారణకు గతంలో మాదిరిగానే ఈసారి కూడా టోకెన్ల విధానం అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 10.42 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసి సన్న, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనడానికి కేంద్రాలు ఏర్పాటు చేశారు. టోకెన్ విధానం లేనప్పుడు కేంద్రం నిర్వాహకులు అవకతవకలకు పాల్పడేవారు. నగదు ముట్టజెప్పిన రైతుల ధాన్యాన్ని కాంటాలు వేశారు. మిల్లర్లు ఆ ధాన్యానికి కోత విధించేవారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఇతర గ్రామాల ధాన్యాన్ని, దళారుల సరకునూ ఆయా నిర్వాహకులు కొనుగోలు చేసేవారు. దీంతో కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతులు ఇబ్బందులు పడాల్సిన వచ్చేది. కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు.అవకతవకలకు తావు లేకుండా సజావుగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. ముందుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన సమయంలో నిర్వాహకులు రైతు పేరు, వివరాలు నమోదు చేసుకుంటారు. మండల వ్యవసాయ అధికారులు ధాన్యం తేమ శాతం పరిశీలిస్తారు. 17 శాతం తేమ వచ్చినసంబంధిత రైతుకు టోకెన్ అందిస్తారు. దాని ప్రకారం ధాన్యా న్ని బస్తాల్లో ఎప్పుడు నింపుతారు, మిల్లుకు ఎప్పుడు తరలిస్తారో.. చెబుతారు.

# నిఘా నేత్రాలకు మసక

**కొత్తగూడెం,తెలంగాణ దిశ :** ఒక్క సీసీ (క్లోజ్డ్ సర్క్యూట్) కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానం'.. తరచూ సమీక్షలు, సమావేశాల్లో పోలీసు అధికారులు చెప్పేమాట ఇది. కానీ, చాలాచోట్ల నిఘా నేత్రాలు మసకబారుతున్నాయి. ముఖ్యంగా పట్టణాల్లోని కూడళ్లలో. భారీ వర్షాలతో పాటు వానరాల చేష్టలతో పలుచోట్ల సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయి. కేబుల్స్ వ్యవస్థ పనిచేయకుండా పోయింది. వాటిని పర్యవేక్షించే వ్యవస్థ సైతం సరిగా లేదు. ఫలితంగా నేర పరిశోధన, ఆధారాల సేకరణకు కూడా వీల్లేకుండా పోతోంది. ఓ వైపు కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజెప్పే అధికారులు.. ఇప్పుడు అందుబాటులో ఉన్నవాటి నిర్వహణను పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని ప్రధానమైన కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు పురపాలకాల్లో 'ఈనాడు-పరిశీలన' చేపట్టింది. అక్కడి పరిస్థితులు ఇలా ఉన్నాయి. ఇక్కడ మొత్తం 72 సీసీ కెమెరాలున్నాయి. చెరువుకట్ట ఏరియా, గోవింద్ సెంటర్, కొత్త బస్టాండ్, బుగ్గవాగు, పాతబస్టాండ్, జగదాంబ సెంటర్, సుభాష్‌నగర్ సహా అన్ని ప్రధాన కూళ్లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం పలు చోట్ల బాగానే పనిచేస్తున్నాయని అంచనా వేస్తున్నా.. ఇటీవల వర్షాల కారణంగా కేబుల్స్ దెబ్బతినడంతో 20కి పైగా మరమ్మతులకు గురైనట్లు పరిశీలనలో తేలింది. కాలనీలు, వ్యాపార సముదాయాల్లో నిఘా నేత్రాల ఏర్పాటు ఆవశ్యకతపై సీఐ సత్యనారాయణ 'మేముసైతం'లో భాగంగా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో నిఘా నేత్రాలు కీలకంగా మారాయి. ఒకటో పట్టణ ఠాణా పరిధిలో 38కి గాను 8, రెండో పట్టణ ఠాణా పరిధిలో 23కి 6, మూడో పట్టణ ఠాణా పరిధిలో 64కి గాను 21 వరకు పనిచేయడం లేదు. ప్రధాన వీధులు, కూడళ్లలో దాదాపు 60 వరకు సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో సుమారు 24 మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. మిగతా చోట్ల సాంకేతిక కారణాలు, వర్షాల కారణంగా మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు



తీసుకుంటున్నామని పాల్వంచ పట్టణ పోలీసు అధికారులుపేర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన నాలుగింటిలో కేవలం రెండు సీసీ కెమెరాలే సరిగా పనిచేస్తున్నాయి. పోలీసు శాఖ స్వయంగా ఏర్పాటు చేసిన వాటిల్లో పలు నిఘా నేత్రాలు సాంకేతిక సమస్యలు, కేబుల్ వ్యవస్థ దెబ్బతిని సరిగా పనిచేయడం లేదు. వీటికి సత్వరం మరమ్మతులు చేయకపోతే నేర పరిశోధనకూ ఆటంకాలుగా తప్పేలా లేవు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం పట్టణం పోలీసులు యోచిస్తున్నట్లు సీసీ కెమెరాల వ్యవస్థ నిర్వహణను ఏదైనా ఏజెన్సీకి అప్పగించడం శ్రేయస్కరమనే అభిప్రాయం పురవాసుల్లో వ్యక్తమవుతోంది. కొత్తగూడెం పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల నిర్వహణకు సంబంధించి నిధులు కేటాయించాలని పురపాలక కమిషనర్‌ను ఇటీవల కోరాం. దీంతో వారు స్పందించి రూ.6 లక్షల నిధులు కేటాయిస్తామని చెప్పారు. దీంతో పాటు నిఘా నేత్రాల నిర్వహణ బాధ్యతలను ఉన్నాం. తద్వారా అవి నిరంతరం పనిచేసేలా చూస్తాం. 'మేముసైతం' కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యాన్ని సైతం కోరుతున్నాం. దుకాణ సముదాయాలు, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే భద్రత ఉంటుందనేది మా సూచన.

# పరికరాల కొరత.. సాగని విద్యుదీకరణ




**నల్గొండ,తెలంగాణ దిశ :** దిమ్మె నిర్మించినా ఏర్పాటు చేయని విద్యుత్తు నియంత్రిక పెరుగుతున్న విద్యుత్తు సర్వీసులకు అనుగుణంగా చేపడుతున్న విద్యుదీకరణ పనులకు బ్రేకులు పడుతున్నాయి. సంస్థలో పరికరాల కొరత వేధిస్తోంది. వానాకాలం పంటల నూర్పిడి పూర్తి కానుండటంతో నిలిచిన, కొత్తగా చేపట్టాల్సిన పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు ముందుకు వస్తున్నా.. విద్యుదీకరణ పనులకు కావాల్సిన ప్రధాన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు, వినియోగదారు లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారా నియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. రైతులు విద్యుత్తు నియంత్రికల కోసం డీడీలు చెల్లించినా.. మంజూరైన స్తంభాలు, తీగ, ఏబీ స్విచ్‌లు, హెడ్జ్ ఫ్యూజుల కాసారాలు, క్లాంపులు వంటి సామగ్రి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం అధికారులు అందించలేకపోతున్నారు. నియంత్రికల వద్ద కరెంటు సరఫరాను నియంత్రిం చడంలో కీలకమైన ఏబీ స్విచ్‌ల కొరత ఎప్పటి నుంచో వేధిస్తోం ది. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే విద్యుత్తు ఉపకేంద్రాల్లో కరెంటు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారానియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ నియంత్రికల కొరతతో పనుల్లో జాప్యం నెలకొంటుంది. దేవరకొండ, నల్గొండ, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టాల్సి ఉండగా.. పరికరాల కొరతతో అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నల్గొండ, యాదాద్రి భువనగిరి సర్కిళ్ల పరిధిలో సుమారు 1050కి పైగా విద్యుత్తు నియంత్రికలు, 1125కిపైగా ఏబీ స్విచ్‌ల కొరత నెలకొంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా విద్యుత్తు శాఖలపై సమీక్ష నిర్వహించారు. పరికరాల కొరతను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు సీఎండీతో చర్చించినట్లు తెలిసింది. మంత్రి కోమటిరెడ్డిచొరవతో 250 వరకు నియంత్రికలు అందజేస్తామని హామీ ఇచ్చారని సమాచారం. ఈ మేరకు ఇటీవల వంద ట్రాన్స్‌ఫార్మర్లు నల్గొండ జిల్లాకు చేరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇంకా 900లకు పైగా విద్యుత్తు నియంత్రికలు తక్షణం అవసరం ఉంది. వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ, విద్యుత్తు సంస్థ నల్గొండ సర్కిల్ కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. పూర్తి వివరాలు తెలుసుకుంటాం.

# అలంకారప్రాయంగా బస్తీ దవాఖానా?

**వేములవాడ,తెలంగాణ దిశ :** పేద ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా అలంకారప్రా యంగా మారింది. వేములవాడలోని రాజన్న దర్శనానికి వచ్చే భక్తులతో పాటు జాత్రగౌండ్ ప్రాంతంలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏడాదిన్నర క్రితం ఆలయ లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో దీనిని ఏర్పాటు చేశారు. అన్ని వసతులు కల్పించి రెండు పడకలతో ప్రారంభించారు. ఇందులో ఒక వైద్యుడు, స్టాఫ్‌నర్స్, హెల్పర్‌ను నియమించారు. ఆసుపత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి నామమాత్రంగానే రోగులు వస్తున్నారు. స్థానికులు మాత్రం రక్తపోటు, మధుమేహం, దగ్గు వంటి వాటికి మందుల కోసం వస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులే తక్కువగా ఉంటే మందులు కూడా అరకొరగానే సరఫరా అవుతున్నాయి. మందుల కోసం ఇండెంట్ పెట్టినప్పటికీ ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ఒక వేళ వచ్చినా పూర్తి స్థాయిలో రావడం లేదు. ఆరు నెలల నుంచి అరకొరగానే మందులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఆసుపత్రి ముందు భక్తులు, ఇతరులు వాహనాలు నిలుపుతున్నారు. దీనికి ఇరువైపులా రహదారులను ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వారంలో ఈ రోజుల్లోనే... వారంలో




శనివారం ఆసుపత్రికి సెలవు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యుడు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. మిగతా రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంటుంది. రాజన్న ఆలయానికి రాత్రింబళ్లు భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం వేములవాడకు వచ్చినవారు ఇక్కడ వసతి గదుల్లో బస చేసి సోమవారం స్వామివారిని దర్శించుకుంటారు. రాత్రి వేళ ఏదేని వైద్య సహాయం అవసరమైతే భక్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 24గంటలూ వైద్య సేవలుప్రభుత్వం చర్యలు తీసుకుని వైద్య సేవలను మరింత విస్తృత పరచాల్సిన అవసరం ఉంది.



# థ్రాంబెక్టమీతో.. స్ట్రోక్‌కు చెక్

పక్షవాతం (స్ట్రోక్) చికిత్సను 2014వ సంవత్సరం కొత్తపుంతలు తొక్కించింది. ఆ ఏడాది అధునాతనమైన చికిత్సా పద్ధతి అందుబాటులోకి వచ్చింది. అదే.. థ్రాంబెక్టమీ. జనరల్ అనెస్తీషియా అవసరం లేని సర్జరీ ఇది. కేవలం లోకల్ అనెస్తీషియాతో స్ట్రోక్ వచ్చిన 24 గంటల్లోగా థ్రాంబెక్టమీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పక్షవాతంతో పోలిస్తే గుండెపోటు నుంచి బయటపడటం చాలా సులువు. గుండె ఎక్కడ ఉంటుందో గుండెపోటు లక్షణాలు కూడా అక్కడే ఉంటాయి. కానీ మెదడులో సమస్య వల్ల తలెత్తే పక్షవాతం లక్షణాలు ఏ కాళ్లూ చేతుల్లోనో కనిపిస్తాయి. అందుకే దీన్ని తొందరగా గుర్తించలేకపోతారు. అంతేకాదు.. గుండెపోటుకు ఒక్క ఈసీజీ చూసి చికిత్సకు సిద్ధం కావొచ్చు. పక్షవాతానికి మాత్రం సీటీ ఆంజియోగ్రామ్, సీటీ స్కాన్ లేదా ఎంఆర్ఐ ఆంజియోగ్రామ్, ఎంఆర్ఐ స్కాన్లు చేస్తారు. వీటిద్వారా వచ్చింది ఏ రకమైన పక్షవాతమో తెలియడం మాత్రమే కాకుండా, నాడీ కణజాలం ఎంతమేరకు ప్రభావితం అయ్యిందనే విషయం కూడా నిర్ధారణ అవుతుంది. ఇలా వైద్యులు సమస్యను పూర్తిగా గుర్తించి, తగిన చికిత్స చేస్తారు.

శరీరంలో కణాలన్నీ ఆరోగ్యంగా ఉండాలంటే కణ కణానికీ నిరంతరం రక్తం సరఫరా కావాలి. మెదడులోని కణాలు కూడా అంతే. ఏ కారణం చేతనైనా మెదడుకు తగినంత రక్తం అందకపోతే ఆయా కణాలు దెబ్బతిని చనిపోతాయి. ఇలా రక్తం అందకపోవడానికి ప్రధానంగా రెండు రకాల కారణాలున్నాయి. మొదటిది ఇస్కిమిక్ స్ట్రోక్. అంటే%ఞ% మెదడుకు మొత్తం నాలుగు రక్తనాళాలు వెళ్తాయి. ఇందులో రెండు రక్తనాళాలు మెదడు ఎడమవైపుకి, రెండు కుడివైపుకి వెళ్తాయి. వీటిలో ఎక్కడైనా రక్తం గడ్డకడితే అది రక్త ప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది. దాంతో మెదడుకు రక్తసరఫరా సరిగా జరగక పక్షవాతం వస్తుంది. దాదాపు 80 శాతం స్ట్రోక్ కేసులకు ఇదే కారణం. ఇక రెండో రకం హెమరేజిక్ స్ట్రోక్. ఈ రకం దానిలో రక్తనాళాల్లో ఏదైనా చిట్లిపోయి, రక్తం బయటికి రావడంతో మెదడులో కణాలు దెబ్బతింటాయి. ఇలాంటప్పుడు వచ్చే పక్షవాతం ఇది. దాదాపు 20 శాతం పక్షవాతం కేసులకు కారణం హెమరేజిక్ స్ట్రోక్.

ఎందుకు వస్తుంది?: పక్షవాతం రావడానికి ప్రధాన కారణం అధిక రక్తపోటు. మధుమేహం కూడా కారణమవుతుంది. బీపీ, మధుమేహం ఇంతకుముందైతే అరవయ్యేండ్ల వయసులో కనిపించేవి. కానీ ఇప్పుడు ముప్పైల్లోనే దాపురిస్తున్నాయి. అందుకే ఈ వయసు వాళ్లలో కూడా పక్షవాతం కనిపిస్తున్నది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకుండా జంక్‌ఫుడ్‌కు తినడం, ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌కు ఇప్పటి యువత అలవాటు పడుతున్నది. ఇవన్నీ కూడా పక్షవాతానికి కారణమయ్యేవే. మరో ముఖ్య కారణం అధిక ఒత్తిడి. కార్పొరేట్ ఉద్యోగాలు పెరిగిన తర్వాత చిన్న వయసులోనే అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దాంతో నలభై ఏండ్లు దాటకుండానే పక్షవాతానికి గురవుతున్నారు. ఇలాంటి జీవనశైలి కారణాలతోపాటు జన్యుపరమైన అంశాలు కూడా పక్షవాతం రావడానికి దోహదపడతాయి.

పక్షవాతానికి మరో కారణం డైసెక్షన్. దీనిలో రక్తనాళంలోని రెండు పొరలు విచ్చుకుంటాయి. సాధారణంగా రక్తనాళంలో 3 పొరలు ఉంటాయి. వీటిలో మొదటి రెండు పొరలు తెరుచుకుని అందులోకి రక్తం వెళ్తుంది. దానివల్ల పక్షవాతం వస్తుంది. ఎక్కువగా మసాజ్ చేయించుకోవడం, లాంగ్ డ్రైవ్ చేయడం, డ్రైవ్ చేస్తూ మెడ వెనక్కి తిప్పడం వల్ల రక్తనాళాలు మెలితిరిగిపోయి ఇలాంటి సమస్య రావొచ్చు. చిన్నారుల్లో గుండెజబ్బుల వల్ల పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువ. ఆ తర్వాత సికిల్‌సెల్ ఎనీమియా, మోయా–మోయా అనే వ్యాధి (దీనిలో రక్తనాళాలు సన్నగా అవుతాయి) లాంటివి చిన్నపిల్లల్లో పక్షవాతానికి కారణమవుతాయి.

ఏం జరుగుతుంది?: మెదడులో నాడీ కణజాలానికి రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడినప్పుడు ఆ కణాలకు పోషకాలు, ఆక్సిజన్ అందక అక్కడి కణాలు నశిస్తాయి. ఇలాంటప్పుడు ఏ నాడీ కణజాలం మన శరీరంలో ఏ పనిని నిర్వర్తిస్తుందో%ఞ% ఆ కణజాలం దెబ్బతినడం వల్ల ఆయా పనులు చేయలేకపోతాం. ఉదాహరణకు కాలు, చెయ్యి కదలికలను నియంత్రించే నాడీ కణజాలానికి రక్తం అందక అది చచ్చుబడిపోతే ఇక కాలు, చెయ్యి కదిలించలేం. మాటకు సంబంధించిన నాడీ కణజాలం దెబ్బతింటే మాట పడిపోవడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం లాంటి సమస్యలు వస్తాయి.

సమయం.. అత్యంత కీలకం!: నాడీకణాలు ఒకసారి చచ్చిపోతే ఇక కొత్త నాడీకణాలు ఏర్పడవు. కాబట్టి అవి నశించిపోకుండా చూసుకోవాలి. పక్షవాతం వచ్చినప్పుడు రక్త సరఫరా ఆగిపోయిన చోట ఉన్న కొన్ని కణాలు వెంటనే దెబ్బతింటాయి. నిమిష నిమిషానికీ ఇలా దెబ్బతినే కణాల సంఖ్య పెరుగుతూ పోతుంది. ఒక నిమిషానికి ఏడు వందల కోట్ల (7 బిలియన్ల) న్యూరాన్లు చనిపోతాయి. అందుకే పక్షవాతం వచ్చినప్పుడు ప్రతీ నిమిషం కీలకమైనదే. బ్లాక్ దగ్గర ఉన్న కణాల చుట్టూ కొంతమేర ఉండే కణజాలాన్ని పెనెంబ్రా అంటారు. దీన్ని రిస్క్‌లో ఉన్న కణజాలంగా పరిగణిస్తారు. ఈ కణజాలం ఎంత ఎక్కువ భాగం డ్యామేజీ అయితే అంత ఎక్కువ నష్టం ఉంటుంది. సమయం మించిపోతున్న కొద్దీ ఫలితం వేరుగా ఉంటుంది. రిస్క్ కణజాలం మొత్తం డ్యామేజీ అయ్యిందంటే ఇక ఏ చికిత్సా అందించలేం. అందుకే పక్షవాతం వచ్చినప్పుడు రోగిని ఎంత తొందరగా హాస్పిటల్‌లో చేరిస్తే అంత మంచిది.

మొబైల్ స్ట్రోక్ యూనిట్స్: చాలా దేశాల్లో పక్షవాతానికి త్వరగా చికిత్స అందించడానికి ప్రత్యేకమైన అంబులెన్స్ యూనిట్లు ఉంటాయి. వీటిని మొబైల్ స్ట్రోక్ యూనిట్స్ అంటారు. ఈ అంబులెన్స్‌లోనే సీటీ స్కాన్, డాక్టర్, నర్సు అందరూ ఉంటారు. రోగి దగ్గరికి వెళ్లగానే అదే అంబులెన్సులో సీటీ స్కాన్ చేసి, అక్కడే ఇంజెక్షన్ ఇస్తారు. ఇలాంటి యూనిట్లను హైదరాబాద్‌లో కూడా ప్రారంభించే ఆలోచన ఉంది. అయితే మన దగ్గరి మొబైల్ స్ట్రోక్ యూనిట్లో సీటీ స్కాన్‌ను ఉంచలేం. అందువల్ల రోగిని సీటీ స్కాన్ చేయించుకోమని, ఆ రిపోర్ట్ వాట్సాప్‌లో పంపించమని వైద్యులు సూచిస్తారు. ఈలోపు అంబులెన్స్ పేషెంట్ దగ్గరికి చేరుకుంటుంది. అక్కడే వెంటనే ఇంజెక్షన్ చేసి రోగిని హాస్పిటల్‌కు తరలిస్తారు. పైగా రోగి హాస్పిటల్ దాకా వచ్చే సమయం మిగిలిపోతుంది కూడా!

ఎలా గుర్తించాలి?: మాటలో తేడా రావడం, నత్తి, సరిగ్గా మాట్లాడలేకపోవడం, విన్నది అర్థం చేసుకోలేకపోవడం, మూతి పక్కకు వెళ్లిపోవడం (ఫేషియల్ పెరాలిసిస్), ఒకవైపు చెయ్యి, కాలు బలహీనం కావడం, ఒక కాలు లేదా ఒక చెయ్యి బలహీనం కావడం, నడిస్తే అడుగులు తడబడటం, మనుషులు ఒక్కరే ఇద్దరుగా కనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సీటీ స్కాన్ చేయించాలి. పక్షవాతం నిర్ధారణ జరిగితే చికిత్స మొదలుపెట్టాలి.


చికిత్సతో బాగవుతుందా?: పక్షవాతానికి ఒకప్పుడు చికిత్స లేదు. కానీ గత 15 20 ఏండ్లుగా మంచి చికిత్స అందుబాటులో ఉన్నది. లక్షణాలు కనిపించిన మొదటి నాలుగున్నర గంటలలోగా హాస్పిటల్‌లో చేరాలి. వెంటనే తగిన చికిత్స తీసుకుంటే శరీరంలో ఎలాంటి అవకరా లు ఏర్పడకుండా ఉంటాయి. రోగిని హాస్పిటల్‌లో చేర్చగానే వైద్యులు సీటీ స్కాన్ చేస్తారు. ఇందులో రక్తనాళం చిట్లి రక్తస్రావం కావడం వల్ల పక్షవాతం వచ్చిందా, లేదా బ్లాక్ వల్ల వచ్చిందా అనేది తెలుస్తుంది. రక్తస్రావం వల్ల కాకుండా బ్లాక్ వల్ల వచ్చిన ఇస్కిమిక్ స్ట్రోక్ అయితే వెంటనే క్లాట్ కరగడానికి ఒక ఇంజెక్షన్ ఇస్తారు. ఇది టిష్యూ ప్లాస్మోజెన్ యాక్టివేటర్ (టిపిఎ)లేదా టెనెక్టిప్లేస్ ఇంజెక్షన్.ఇలా ఇంజెక్షన్ ఇవ్వడాన్ని థ్రాంబోలైటిక్ థెరపీ అంటారు. ఈ ఇంజెక్షన్ వల్ల రక్త సరఫరాకు ఆటంకంగా ఉన్న గడ్డ కరిగిపోయి రక్తనాళం తెరుచుకుం టుంది. దాంతో రక్త సరఫరా సాఫీగా జరుగుతుంది. ఫలితంగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నాడీ కణాలకు ఆక్సిజన్ అంది, అవి మెరుగుపడ తాయి. ఇంజెక్షన్ ఇచ్చినప్పటికీ రక్తనాళంలో గడ్డ కరగకుండా రక్తనాళం తెరుచుకోకపోతే, మెకానికల్ థ్రాంబెక్టమీ చేస్తారు. అంటే ఎండోవాస్కు లర్ థెరపీ ద్వారా కేథటర్ పంపి, క్లాట్ తీసేస్తారు. ఇది 6 గంటలలోపు చేయాలి. కొందరిలో 24 గంటల లోపు కూడా చేయవచ్చు. పక్షవాతం నుంచి కోలుకోవడానికి ఫిజియోథెరపీ అత్యంత ముఖ్యమైన చికిత్స. ఫిజియోథెరపీలో స్ట్రెంథెనింగ్ వ్యాయామాలు చేయిస్తారు. కండరాల్లో స్టిఫ్‌నెస్ పోవడానికి ఇంజెక్షన్లు ఇస్తారు. వాకింగ్ చేయిస్తారు. ఇలాంటి వాటివల్ల పక్షవాతానికి గురైన అవయవాలు తిరిగి శక్తి పుంజుకుంటాయి. వాటి పనితీరు మెరుగుపడుతుంది. థ్రాంబోలైటిక్ థెరపీ ఇంజెక్షన్లు జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంటే చికిత్స అక్కడికక్కడే వెంటనే ఇవ్వొచ్చు. అలా హైదరాబాద్ వరకూ వచ్చే టైం మిగులుతుంది. రోగి కోలుకునే అవకాశాలు పెరుగుతాయి.

సర్జరీ ఏంటి?: సాధారణంగా పక్షవాతం (స్ట్రోక్) వస్తే ప్రతి పదిమందిలో నలుగురికి ఇంజెక్షన్ అవసరమైతే, ఇద్దరికి సర్జరీ అవసరం అవుతుంది. అయితే, సర్జరీ అనగానే ఇదేదో పెద్ద కోతపెట్టి చేసే ఆపరేషన్ అని భయపడనక్కర్లేదు. కాలి రక్తనాళం ద్వారా కేథటర్ గుండా స్టెంట్ రిట్రీవర్ అనే పరికరాన్ని క్లాట్ దగ్గరికి పంపించి, దాన్ని తొలగిస్తారు. దీన్ని థ్రాంబెక్టమీ అంటారు. రోగి తొడ భాగంలో చిన్న కోత పెట్టి ఆప్టిక్ ఫైబర్ కేబుల్‌ను రక్తనాళం గుండా మెదడులో మూసుకుపోయిన రక్తనాళంలోకి పంపిస్తారు. తర్వాత సున్నితమైన గొడుగు లాంటి స్టెంట్ రిట్రీవర్‌ను కేథటర్ గుండా పంపిస్తారు. మెదడు రక్తనాళంలో పూడిక ఉన్న చోట స్టెంట్ రిట్రీవర్ గొడుగు లాగా తెరుచుకుని అక్కడ అడ్డంగా ఉన్న గడ్డను తనలోకి లాగేసుకుంటుంది. అప్పుడు దాన్ని బయటికి లాగేస్తారు. రక్తనాళంలో ఏర్పడ్డ గడ్డ తొలగిపోవడంతో రక్త ప్రసరణ సాఫీగా కొనసాగుతుంది.

సర్జరీ.. ఎప్పుడు?: రక్తనాళంలో చిన్న చిన్న గడ్డలు లేదా క్లాట్స్ ఏర్పడినప్పుడు చేతికి ఇంజెక్షన్ ఇస్తే అవి కరిగిపోతాయి. కానీ రక్తనాళంలో ఏర్పడే పెద్ద పెద్ద క్లాట్స్‌ను కరిగించాలంటే ఈ థ్రాంబోలైటిక్ థెరపీ ఇంజెక్షన్‌తోపాటు సర్జరీ కూడా అవసరం అవుతుంది. పక్షవాతం వచ్చిన నాలుగున్నర గంటల తర్వాత హాస్పిటల్‌కు తీసుకువచ్చినా సర్జరీ తప్పనిసరి. ఇంజెక్షన్ ఇవ్వలేని పరిస్థితులు ఉన్నవాళ్లకు కూడా సర్జరీ అవసరం ఏర్పడుతుంది. అంటే థ్రాంబోలైటిక్ ఏజెంట్స్ లాంటి మందులు తీసుకున్నవాళు ,, అంతకు ముందు నెలలోపు సర్జరీ అయినవాళ్లు, ఇటీవలే స్ట్రోక్ వచ్చినవాళ్లకు థ్రాంబోలైటిక్ థెరపీ చేయలేం. ఇలాంటివాళ్లకు థ్రాంబెక్టమీ సర్జరీ చేస్తారు.సాధారణంగా స్ట్రోక్ వచ్చిన నాలుగున్నర గంటల్లోగా థ్రాంబోలైటిక్ థెరపీ తీసుకోవాలి. ఏ కారణం చేతనైనా హాస్పిటల్‌కు రావడం ఆలస్యం అయినవాళ్లకు ఈ థ్రాంబెక్టమీ మరో దారి చూపి స్తుంది. ఈ సర్జరీని పక్షవాతం వచ్చిన 24 గంటల్లోగా చేయవచ్చు. ఒకసారి చేసిన తర్వాత కూడా ఈ సర్జరీని ఎన్నిసార్లయినా చేయొచ్చు. సర్జరీ తర్వాత పక్షవాత రోగుల్లో 5 నుంచి 20 శాతం మందిలో మెదడులో వాపు రావొచ్చు. వారికి ఓపెన్ సర్జరీ అవసరం పడొచ్చు.

పక్షవాతంతో ఇక భయం లేదు!: ఎంత చెట్టుకు అంత గాలి.. ఇది ఒకప్పటి సామెత. ఎన్ని చెడ్డ అలవాట్లుంటే అన్ని రోగాలు.. ఇది ఇప్పటి మాట. మారిన ఆహార పద్ధతులు, చిన్న వయసులోనే దుర్వ్యసనాల బారినపడటం.. వెరసి ఎప్పుడో 60 ఏండ్లు దాటాక వచ్చే జబ్బులు ఇప్పుడు పాతికేండ్లకే వచ్చిపడుతున్నాయి. అలాంటి వ్యాధుల సరసన పోటీ పడుతున్న జబ్బుల్లో పక్షవాతం ఒకటి. చిన్నవయసులోనే పక్షవాతం బారినపడుతున్న వాళ్ల సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు, అంగవికలత్వానికి పక్షవాతం రెండో కారణంగా మారింది. అలాగని పక్షవాతం బారినపడ్డామని కుంగిపోనవసరం లేదు. త్వరగా హాస్పిటల్‌లో చేరితే పక్షవాతం వచ్చినా కూడా ఎప్పట్లా జీవించే వీలుంది. పక్షవాతం లక్షణాలు, చికిత్సల గురించి అవగాహన పెంచుకుని సకాలంలో గుర్తించి, చికిత్స తీసుకోవాలి.


# 2030 నాటికి మనిషిని మించిన మేధస్సు..



## మానవాళినే నాశనం చేయనున్న ఏఐ!
## 'గూగుల్ డీప్‌మైండ్' అంచనా

న్యూఢిల్లీ, : ఆధునిక సాంకేతికతల్లో ఒకటైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా పురోగమిస్తున్నది. భవిష్యత్తులో ఈ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి మనుగడకే ప్రమాదకరంగా మారుతుందన్న భయాందోళనలు చాలా కాలం నుంచి వినిపిస్తున్నాయి. ఆ రోజులు త్వరలోనే రాబోతున్నట్టు తాజా పరిశోధనలో తేలింది. 2030 నాటికి ఏఐ మరింత అభివృద్ధి చెందుతుందని, మానవులతో సమానమైన తెలివితేటలు కలిగిన కృత్రిమ మేధస్సుగా పిలిచే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ)గా రూపాంతరం చెంది మానవాళిని శాశ్వతంగా నాశనం చేస్తుందని 'గూగుల్ డీప్‌మైండ్' తన పరిశోధనా పత్రంలో పేర్కొంది. అయితే ఈ ముప్పు ఎలాంటిదో, మానవాళి మనుగడకు ముప్పుఎలా వస్తుందో వెల్లడించలేదు. ఏజీఐ వల్ల ఎదురయ్యే ప్రమాదాలను ఈ అధ్యయనం 4 ప్రధాన క్యాటగిరీలుగా విభజించింది. ఏజీఐతో సమాచార దుర్వినియోగం (డాటా మిస్ యూజ్), మిస్ అలైన్‌మెంట్, మిస్టేక్స్, స్ట్రక్చరల్ రిస్క్‌ల లాంటి ప్రమాదాలు ఉన్నాయని ఈ పరిశోధనా పత్రం సహ రచయిత, 'డీప్‌మైండ్' సహ వ్యవస్థాపకుడు షేన్ లెగ్ స్పష్టం చేశారు. ఈ ప్రమాదాలను తగ్గించేందుకు గూగుల్, ఇతర ఏఐ కంపెనీలు తగిన నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. కృత్రిమ మేధస్సును నియంత్రణలో ఉంచడంపైనే ఈ పరిశోధనలో దృష్టి కేంద్రీకరించామని, దాని వల్ల ఎదురయ్యే ముప్పుపై లోతుగా అధ్యయనం చేశామని చెప్పారు. కాగా, మనుషుల కంటే ఎక్కువ తెలివితేటలు కలిగిన ఏజీఐ రాబోతున్నదని, వచ్చే 5 నుంచి 10 ఏండ్లలో దీని ఆవిర్భావం ప్రారంభం కావచ్చని 'డీప్‌మైండ్' సీఈవో డెమిస్ హస్సాబిస్ రెండు నెలల క్రితమే స్పష్టం చేశారు. ఏజీఐ అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన ఉద్ఘాటించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐకి మరో ముందడుగే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్. ఏఐ అనేది టాస్క్ స్పెసిఫిక్‌గా ఉంటుంది. అంటే మనం ఇచ్చిన పనులను మాత్రమే చేయగలుగుతుంది. కానీ, ఏజీఐ అనేది మానవ మేధస్సు మాదిరిగా అనేక రకాల పనుల నిర్వహణకు అవసరమైన తెలివితేటలను కలిగి ఉండేలా లక్ష్యాలను పెట్టుకుంటుంది. స్పష్టంగా చెప్పాలంటే ఇది మనుషుల మాదిరిగా విభిన్న డొమైన్లలోని జ్ఞానాన్ని అర్థం చేసుకుని, నేర్చుకోవడంతోపాటు ఆ జ్ఞానాన్ని రకరకాల పనుల కోసం అన్వయించగలిగే ఓ యంత్రం.


# తరచూ రక్త విరేచనాలు అవుతున్నాయి



మా బాబుకు పద్నాలుగు ఏండ్లు. ఆరు నెలల నుంచి తరచుగా విరేచనాలు అవుతున్నాయి. విరేచనం కొద్దికొద్దిగా అయ్యింది. కొన్నిసార్లు రక్తం కూడా పడింది. డాక్టర్ దగ్గరకు వెళ్తే మందులు ఇచ్చారు. వాటిని వాడినప్పుడు తగ్గడం.. కొన్నాళ్లకు మళ్లీ విరేచనాలు అవ్వడం సాధారణమై పోయింది. ఈ ఆరు నెలల్లో బరువు తగ్గాడు. ఎప్పుడూ నీరసంగా ఉంటున్నాడు. పరిష్కారం ఏంటి?

పిల్లలకు అప్పుడప్పుడూ విరేచనాలు కావడం సాధారణమే. వైరస్ ఇన్ఫెక్షన్ వల్ల అలా జరుగుతుంది. అప్పుడప్పుడూ నీళ్ల విరేచనాలు కూడా అవుతాయి. కొన్నిసార్లు వాంతులతో మొదలవుతాయి. కొన్నిరోజులకు తగ్గుతాయి. తగ్గకపోతే లక్షణాన్ని బటి వైద్యం చేయించాల్సి ఉంటుంది. ఓఆర్ఎస్ నీళ్లు తాగడం, ప్రో బ్యాక్టీరియా పదార్థాలు తినడం వల్ల సాధారణ విరేచనాలు తగ్గుతాయి. కానీ ఆరు నెలల నుంచి పదే పదే విరేచనాలు అవ్వడం, రక్తం పడటం, బరువు తగ్గడం, నీరసంగా ఉండటం మంచి లక్షణాలు కావు. దీనికి ఏదైనా బలమైన కారణం ఉందేమో తెలుసుకోవాలి. ఇన్‌ఫ్లమేటరీ బవల్ సిండ్రోమ్ అనే పేగు సంబంధమైన సమస్యలు ఉంటే ఇలాగే అవుతుంది. దానిని క్రాన్స్ డిసీజ్ అంటారు. ఇది పిల్లలకే కాదు పెద్దలకూ వస్తుంది. పేగుల్లో రియాక్షన్ వల్ల ఇన్‌ఫ్లమేషన్ కలుగుతుంది. ఆహారం జీర్ణం కాకపోవడం, రక్తం పోవడం వల్ల రక్తహీనత బారినపడతారు. అందువల్ల నీరసంగా ఉంటారు. మీ ఇంట్లో ఇలాంటి లక్షణాలతో ఎవరైనా ఉన్నారా? అన్నది రాయలేదు. బహుశా లేకపోవచ్చేమో! పిల్లల వైద్యులను.. అలాగే గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ని సంప్రదించి తీవ్రమైన, దీర్ఘకాల వ్యాధి కాదని నిర్ధారించుకోవాలి. ఒకవేళ ఇది ఇన్‌ఫ్లమేటరీ బవల్ సిండ్రోమ్ అయితే దానికి చికిత్స ఉంది. ప్రత్యేకమైన మందులు వాడుతూ, కొన్ని ఆహార నియమాలు పాటిస్తే తగ్గుతుంది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా పీడియాట్రీషియన్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ని కలవండి.

# పెట్రోలు, డీజిల్ ధరలను రూ.2 లు తగ్గించాలి : సిపిఐ(యం)




విజయవాడ : పెట్రోలు, డీజిల్ ధరలను రూ. 2 లు తగ్గించాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. పెట్రోలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి అంతర్జాతీయ ముడి చమురు ధరలకనుగుణంగా ధరలను తగ్గించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. రూ.2 లు అదనపు సుంకాన్ని విధించినా ధర పెంచలేదంటూ ప్రజ లను మభ్యపరిచి, మోసపుచ్చటాన్ని సిపిఐ(ఎం) నిరసిస్తున్నదన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయనీ, అందుకనుగుణంగా ఇక్కడ కూడా పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారాన్ని తగ్గించాల్సింది పోయి ఎక్సైజ్ సుంకాన్ని పెంచి కేంద్ర ప్రభుత్వం తన ఖజానాలో వేసుకోవడం గర్హనీయమ న్నారు. పైగా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచలేదని ప్రచారం చేసుకోవడం ప్రజలను మభ్యపరచడమేనన్నారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచి, తగ్గినప్పుడు ధర తగ్గించకపోవడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే లీటరు రూ. 2.లు చొప్పున తగ్గించాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నదని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# పిల్లల తెలివికి కాలుష్యం కాటు



పిల్లలు తమ బాల్యం తొలి సంవత్సరాల్లో ఎక్కువ మోతాదులో కాలుష్యానికి గురవుతే మెదడులో ఆలోచన, శరీర నియంత్రణకు సంబంధించిన భాగాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందట. ఎన్విరాన్‌మెంట్ ఇంటర్నేషనల్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఓ పరిశోధన ఈ విషయం వెల్లడించింది. వాయు కాలుష్యం పిల్లల మెదడు అభివృద్ధికి ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించింది. స్పెయిన్ దేశానికి చెందిన బార్సెలోనా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ఆధ్వర్యంలో ఈ పరిశోధన జరిగింది. పరిశోధన కోసం 3,626 మంది పిల్లల నుంచి సమాచారం సేకరించారు. వీళ్లంతా పార్టిక్యులేట్ మ్యాటర్ 2.5, పార్టిక్యులేట్ మ్యాటర్ 10, నైట్రోజన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల కాలుష్యం బారినపడిన ప్రాంతాల్లో నివసించేవాళ్లే. పుట్టినప్పటి నుంచి మూడేండ్ల వరకు వాయు కాలుష్యం బారినపడితే శరీర కదలికలు, వినికిడికి సంబంధించిన మెదడు భాగాల్లో నాడుల మధ్య అనుసంధానం తక్కువగా ఉంటుందని ఈ పరిశోధన ఫలితాలు వెల్లడించాయి. అయితే, ఈ ఫలితాలను కచ్చితంగా నిర్ధారించడానికి మరింత అధ్యయనం అవసరమని పరిశోధకులు తెలిపారు.

# ఆర్ఎఫ్‌సీఎల్‌లో వారం రోజుల్లో ఉత్పత్తి పునరుద్ధరణ...

**రామగుండం,తెలంగాణ దిశ :** ఏపీ, తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల్లోని రైతాంగానికి యూరియా కొరత నివారణలో కీలకపాత్ర పోషిస్తున్న రామగుండం ఎరువుల కర్మాగారంలో వార్షిక మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. వారం రోజుల్లో యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలనే ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నారు. సాధారణంగా ఏటా నవంబరులో కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేసి అవసరమైన విభాగాల్లో మరమ్మతులు చేపడుతారు. రానున్న ఏడాదికాలంపాటు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటారు. ఈసారి నెల ముందుగానే మరమ్మతులు మొదలు పెట్టారు. వార్షిక మరమ్మతుల ప్రణాళిక ప్రకారం ఈ నెల 23న కర్మాగా రాన్ని తిరిగి ప్రారంభించనున్నారు. 26న యూరియా ఉత్పత్తి ప్రారంభం కానుంది. దీనికి అనుగుణంగా యూరియాను తరలించేందుకు రైల్వే వ్యాగన్ల షెడ్యూలు సైతం రూపొందించారు. కేవలం 15 రోజుల్లోనే వార్షిక మరమ్మతులు పూర్తిచేసి కర్మాగారాన్ని ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రామగుండం ఎరువుల కర్మాగార ంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలోని మొదటి 6 నెలలు లక్ష్యానికి చేరువలో యూరియా ఉత్పత్తి కొనసాగగా.. సుమారుగా రూ.320 కోట్ల లాభాలను ఆర్జించినట్లుగా భావిస్తున్నారు. రామగుండం వార్షిక ఉత్పత్తి లక్ష్యం12.7 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. రానున్న ఆరు నెలల్లో ఇంకా 6.35 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి కావాల్సి ఉంది. వరుసగా మూడేళ్లు లాభాలను



ఆర్జించినట్లయితే సామాజిక బాధ్యతగా ప్రభావిత, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఆర్ఎఫ్‌సీఎల్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.గత రెండేళ్లు లాభాలు ఆర్జించిన ఎరువులకర్మాగారం ఈ ఆర్థిక సంవత్సరం సైతం లాభాల బాటలో పయనిస్తుండటంతో.. 2025-26 నుంచి సీఎస్సార్ నిధులతో గడిచినఆరు నెలల్లో 6.17 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ఎరువుల కర్మాగారం లక్ష్యానికి చేరువలో నిలిచింది. మొదటి త్రైమాసికం(ఏప్రిల్, మే, జూన్)లో రూ.168 కోట్ల లాభాలు గడించినట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

# నిర్వహణ లోపం.. నీరే గరళం

## ట్యాంకులు శుభ్రపరచక కలుషితం

## వ్యాధులు ప్రబలుతున్నా చర్యలు కరవు

**పెద్దపల్లి ,తెలంగాణ దిశ :** నెలలో మూడు సార్లు ట్యాంకులను శుభ్రం చేయాలనే నిబంధన లున్నా జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. పాత పథకాలు 352 ఉండగా మిషన్ భగీరథలో మరో 354 నిర్మించి సరఫరా చేస్తున్నారు. బ్లీచింగ్‌పౌడర్‌తో ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉండగా మొక్కుబడి తంతు కొనసాగిస్తున్నారు. ట్యాంకులకు పగుళ్లు ఏర్పడి లీకవుతున్నాయి. చాలా చోట్ల వాసన వస్తున్న నీటిని జనం తాగడం లేదు. మొత్తం 265 పంచాయతీల్లో 1,100 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. చెత్త తొలగింపు, మురుగుకాలువల శుభ్రతకే వీరు పరిమితమవుతున్నారు. రెండు నుంచి నాలుగు ట్యాంకులున్న పెద్ద పంచాయతీల్లో ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయి. పంచాయతీలకు నెలల తరబడి నిధుల విడుదల లేక బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ట్యాంకు అడుగు భాగంలో బురద మండలకేంద్రంలో అయిదు బావులు, నాలుగు ట్యాంకులున్నాయి. మిషన్ భగీరథ జలాలు అందని బీసీ, ఎస్టీ కాలనీలకు ఊరకుంట చెరువు పక్కనున్న ట్యాంకు, బావి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఎప్పుడో ఒకసారి ట్యాంకును చేస్తున్నారని బీసీ కాలనీవాసులు తెలిపారు. ట్యాంకు పల్లపు ప్రాంతంలో ఉండటంతో ఎప్పుడూ నీరు నిలిచే ఉంటోంది. అందులో పందులు పొర్లుతూ అపరిశుభ్రత నెలకొంది. పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి



సరఫరా విషయమై బ్లీచింగ్, క్లోరినేషన్, ట్యాంకుల శుద్ధి, బల్క్ వాటర్ సప్లై, లీకేజీలు, ఫిర్యాదులు, కొత్త కనెక్షన్ల పేరిట ఏడు రిజిస్టర్లు నిర్వహిస్తున్నారు. ట్యాంకును ప్రతి నెలా 1, 13, 21 తేదీల్లో శుద్ధి చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ తెలిపారు. పెద్దపల్లి పురపాలికలో 9 ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 45 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు చెబుతున్నా బోర్డులపై తేదీలు రాయడం లేదు. స్థానికంగా నీటి పరీక్షలు నిర్వహించడం లేదు. కేవలం ముర్మూర్‌లోని భగీరథ పంపింగ్ కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తున్నారు. కుళాయి నుంచి సరఫరా ప్రారంభమైన కొద్దిసేపటివరకు నీరు మురికిగా వస్తోంది.

# మోసం కొండంత.. వసూలు గోరంత!

# సవాలుగా జీఎస్టీ అక్రమాల కేసు




**కరీంనగర్,తెలంగాణ దిశ :** జగిత్యాల కేంద్రంగా జరిగిన జీఎస్టీ మోసం కథ ఎటూ తేల డం లేదు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోని ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) రూపంలో జరిగిన అక్రమ బాగోతం తాలూకు విచారణ ఇంకా నడుస్తూనే ఉంది. సుమారు 9 నెలల కిందట జగిత్యాలకు చెందిన జీఎస్టీ ప్రాక్టీషనర్ తప్పుడు ధ్రువపత్రాలతో బోగస్ సంస్థలను ఏర్పాటు చేసి దాదాపుగా రూ.288 కోట్ల ఆర్థిక మోసానికి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. కాగితాలపైనే సృష్టించిన పలు బోగస్ కంపెనీలకు ఆ సొమ్మును బదలాయించారు. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించిన వాణిజ్య పన్నుల అధికారులు మొదట విస్తుపోయారు. తీరిగ్గా తేరుకుని బాధ్యుడిగా గుర్తించిన వ్యక్తి కార్యాలయంలో సోదాలు చేపట్టారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేసి అరెస్ట్ చేయించారు. తరువాత ఈ విచారణను హైదరాబాద్ నుంచి వచ్చిన వాణిజ్య పన్నుల శాఖ విజిలెన్స్ అధికారులు చేపట్టారు. తమ సంస్థలను మూసివేయమని జీఎస్టీ ప్రాక్టిషనర్ వద్దకు వచ్చిన కొందరు వ్యాపారుల ఆధార్ కార్డులను ఉపయోగించి ఆన్‌లైన్‌లో ఈ కుంభకోణానికి తెరతీసినట్లు విచారణలో గుర్తించారు. ఇలా 32 బోగస్ కంపెనీలను ఏర్పాటు చేసి సిమెంట్, ఐరన్ వ్యాపారాలు చేస్తున్నట్లు కాగితాల్లోనే నమ్మించాడు. ఆ బోగస్ సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో జమ అయిన మొత్తం డబ్బులను 302 మంది వ్యాపారులకు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఈ నగదు వెళ్లినట్లు గమనించారు. ఇందులో పెద్దమొత్తంలో ఒక సంస్థకు రూ.120 కోట్లు బదలాయింపు జరిగిన తీరు తెలుసుకుని అధికారులు నివ్వెరపోయారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ అక్రమంలో భాగమైన బాధ్యుడిని గుర్తించి పట్టుకున్నప్పటికీ.. పక్కదారి పట్టిన సొమ్మును తిరిగి వసూలు చేయడం అధికారులకు తలకు మించిన భారంగానే మారింది. ఇప్పటి వరకు గుర్తించిన పలువురు వ్యాపారులు, సంస్థల నుంచి రూ.13 కోట్లకుపైగా డబ్బును రాబట్టినట్లు తెలిసింది. మొత్తం మోసంలో ఇప్పటివరకు రికవరీ అయింది కేవలం 5 శాతమే. మూడు నెలల కిందటి వరకు రూ.11 కోట్లు రాగా.. ఇటీవల ఈ మొత్తం రూ.13 కోట్లను దాటినట్లు సమాచారం. జగిత్యాల కేంద్రంగా జరిగిన ఈ భారీ మోసాన్ని అప్పట్లో సవాలుగా తీసుకున్న అధికారులు కాలక్రమేణా ఇతర పనుల్లో తీరిక లేకుండా పోవడంతో విచారణలో దూకుడు ప్రదర్శించడం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పోలీసులు, వాణిజ్య పన్నుల అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే ఇంకా ఇందులో భాగమైన వారెవరనేది బాహ్య ప్రపంచానికి తెలిసే అవకాశముంది.

పైగా రాష్ట్రంలోనే బోగస్ సంస్థలు ఏర్పాటు చేసి సొమ్మును బదలాయించినట్లు గుర్తించిన అధికారులు అందులో కొందరికి సర్‌ఛార్జ్ నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. తరువాత రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని ఉపయోగించి పోయిన నగదును తిరిగి చేజిక్కించుకునే విషయమై కసరత్తు చేసింది. పూర్తిస్థాయిలో మోసపోయిన సొమ్మును వసూలు చేయడం కష్టసాధ్యంగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ కరీంనగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ రవికుమార్‌ను సంప్రదించగా రికవరీ ఎంత చేశారనేది ఈ కేసుని పర్యవేక్షిస్తున్న హైదరాబాద్‌లోని అధికారులకే తెలుస్తుందన్నారు.

# రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణంలో జాప్యం..?



**మెట్‌పల్లి,తెలంగాణ దిశ :** గూడు లేని పేదలకు సౌకర్యవంతమైన సొంతిళ్లు ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకం తీసుకొచ్చింది. లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ఏళ్లు గడుస్తున్నా వారి సంఖ్యకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాల్లో ముందడుగు పడకపోవడంతో అర్హులకు నిరాశే ఎదురవుతోంది. ఇళ్లు పొందేందుకు అన్ని అర్హతలున్నా నిరీక్షణ తప్పడం లేదని పేదలు వాపోతున్నారు. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పురపాలికలతో పాటు మండలాల నుంచి రెండు పడక గదుల ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించి చాలా చోట్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. తొలి విడతలో ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు రూ.6.29 లక్షలు ఖర్చు చేయగా, రెండో విడతలో మాత్రం రూ.5.04 లక్షలు కేటాయించారు. జిల్లాకు మొత్తం 8,225 ఇళ్లు మంజూరవగా, 5,731 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 2,434 ఇళ్ల పనులు మొదలు కాలేదని తెలుస్తోంది. కాగా కొన్ని చోట్ల నిర్మాణాలు ప్రారంభించినా మధ్యలోనే నిలిచిపోయాయి. నిర్మాణ వ్యయం పెరగడం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో చాలా చోట్ల గుత్తేదారులు పనులను మధ్యలోనే వదిలేశారు. 305 ఇళ్లు ప్రగతిలో ఉండగా, అవి ఎప్పటికీ పూర్తవుతాయోనన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో కొన్నిచోట్ల లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించాల్సి ఉంది. అర్హులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించడంలో తాత్సారం జరుగుతోంది. కొన్నిచోట్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా సరిపడా ఇళ్లు నిర్మించక, పూర్తికాక ఎదురు చూపులు చూడాల్సి వస్తే, మరికొన్ని చోట్ల ఇళ్లు పూర్తయినా అర్హుల ఎంపికలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 5,731 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా 4,653 మందికి కేటాయించా రు. ఇంకా మిగతా 1,078 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# గుంటూరు కేంద్రంగా నకిలీ పురుగు మందులు

**దామరచర,తెలంగాణ దిశ :** ఏపీలోని గుంటూరు కేంద్రంగా పేరొందిన కంపెనీల పేరుతో తెలంగాణలో నకిలీ పురుగు మందుల సరఫరా జరుగుతున్నట్లు వ్యవసాయాధికారుల విచారణలో వెల్లడైంది. మిర్యాలగూడతోపాటు దామరచర్ల, అడవిదేవులపల్లి తదితర మండలాల పరిధిలో బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీవి రైతులకు విక్రయిస్తున్నారు. దీనిపై ప్రముఖ సంస్థ కంపెనీ ప్రతినిధులు రెండ్రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొదట మిర్యాలగూడలోని ఓఫర్టిలైజర్స్, సీడ్స్ దుకాణంలో తనిఖీచేయగా ప్రముఖ కంపెనీపేరుతో గలనకిలీ పురుగు మందులు ఉన్నట్లు గుర్తించారు. రూ.52, 900 విలువైన 11కిలోల బరువుగల 23సాచెట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదా రుడిని ప్రశ్నించగా.. ఓవ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి డీలర్ నుంచి సరకు తమకు అందినట్లు తెలిపారు. సమాచారం ప్రకారం మండలంలోని వీర్లపాలెంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేయగా అక్కడా నకిలీవి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గుంటూరు నుంచి ధనావత్ రమేష్ ఈ ప్రాంతంలోని



పలు దుకాణాలకు నకిలీ మందులు సరఫరా చేస్తున్నట్లు ఓ దుకాణ యజమాని వివరించారు. డీఏవో మాట్లాడుతూ..

నకిలీవి విక్రయిస్తున్న దుకాణదారుల అనుమతులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంపెనీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లను రైతులకు చూపించాలని, కొ నుగోలు బిల్లులు అందించాలని ఆదేశించారు

# చెన్నాపురం-గోరుకొండ మధ్యలో పేలిన మందుపాతర

**చర్ల ,తెలంగాణ దిశ :** చర్ల మండలంలోని చెన్నాపురం-గోరుకొండ మధ్యలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు డైరెక్షన్ మైన్(మందుపాతర)ను పేల్చారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీకి చెందిన ఓ పోలీసుకు స్వల్ప గాయాల య్యాయి. సీఐ రాజువర్మ నేతృత్వంలోని పోలీసు బృందం చర్ల మండల ంచెన్నాపురం బేస్ క్యాంపునకు వెళ్లి వెనుదిరిగారు. ఈక్రమంలో గోరుకొండకు సుమారు కి.మీ. పరిధిలోని అటవీ మార్గం లో మలుపు వద్ద అంబూష్ వేసిన మావోయిస్టులు ఒక్కసారిగా రహదారి పక్కన పెట్టిన డైరెక్షన్ మైన్‌ను పేల్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమ య్యారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీ పోలీసుకు స్వల్పగాయాలయ్యాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఈఘటనపై కేసు నమోదు చేసిదర్యాప్తు జరుపుతున్నామని సీఐ రాజువర్మ తెలిపారు. కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరానికి చెందిన మనోహర్, విజ యలక్ష్మి, సురేష్, వేణు, సునీత, భద్రాచలానికి చెందిన నాగసుధీర్, సారపాకకు చెందిన రామకృష్ణ, మరిపెడబంగ్లాకు



చెందిన విజయ్‌కుమార్, మహబూబాబాద్‌కు చెందిన రమేష్‌పై కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలుకు చెందిన వెంకన్న వద్ద వీరంతా మసాలాలు కొనుగోలు చేశారు. రూ.26,31,760 చెల్లించినట్లు నకిలీ బ్యాంకు చలాన్లు పంపి మోసగించారు. బాధితుడు ఈనెల 7న కర్నూలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# 3 రోజులు... 15 బెదిరింపు కాల్స్!

ముంబై: బాంబు పెట్టాం.. పేల్చిపారేస్తాం.. దమ్ముంటే కాపాడుకోండి..! అంటూ ఒక అజ్ఞాతవాసి నుంచి బెదిరింపు స్వరం. తీరాచూస్తే అంతా తూచ్. ఇదీ వరస. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ ఫ్లైట్లన్న తేడా లేదు. ఉత్తుత్తి బెదిరింపులతో వేలాదిమంది ప్యాసింజర్లు బెంబేలెత్తిపోయారు. ప్రాణాలు గుప్పిట పట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి. అటు.. ఏవియేషన్ యంత్రాంగానిక్కూడా చుక్కలు కనిపించాయి.గత మూడు రోజుల్లోనే మొత్తం 15 బాంబ్ థ్రెట్స్ నమోదయ్యాయి.

బుధవారం.. ఈ ఒక్కరోజులోనే ఆరు విమానాలకు బాంబు బెదిరింపులొచ్చాయి. కాకపోతే అన్నీ ఫేకే..! అందరూ క్షేమం. మూడు ఇండిగో, రెండు స్పైస్‌జెట్.. ఒకటి ఆకాశ ఎయిర్.. మొత్తం ఆరు ప్లేన్లలో ప్రయాణికుల్ని బెంబేలెత్తించాయి బోగస్ ఫోన్‌కాల్స్.ఢిల్లీ నుంచి చికాగో వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం.. అగంతకుల బెదిరింపు కారణంగా దారిమళ్లి ంచాల్సి వచ్చింది.

సీక్రెట్‌గా ఒక రిమోట్ ఎయిర్‌పోర్ట్‌లో దింపి.. అందులోని 200 మంది ప్రయాణికుల్ని కాపాడారు. వీళ్లను ఎయిర్‌లిఫ్ట్ చేయడం కోసం..రాయల్ కెనడియన్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన అఅ-330 యుద్ధ విమానాన్ని వాడారు.ఇటీవలే తిరుపతి విమానాశ్రయానికే బెదిరింపు లేఖ వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా సీఐఎస్ఎఫ్ అధికార వెబ్‌సైట్‌కు పంపిన లేఖను గోప్యంగా ఉంచింది ఎయిర్‌పోర్టు అథారిటీ. పోలీసులకు ఫిర్యాదు చేసి, ఈ-మెయిల్ ఆధారంగా నిందితుడ్ని పట్టుకునే ప్రయత్నం జరుగుతోంది.ఒకవైపు ప్యాసింజర్లకు అసౌకర్యం.. మరోవైపు ఫ్లయిట్ షెడ్యూల్స్ మార్చాల్సి రావడం..! ఫేక్ కాల్స్‌తో ఈ హైరానా పడలేకున్నాం అంటూ ప్రైవేట్ ఎయిర్‌లైన్ సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెరుగుతోంది.




## గుంతల దారికి సుంకం చెల్లించాలా?

కాటారం: జాతీయ రహదారుల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం వివిధ ఏజెన్సీలకు దారి సుంకం వసూలు అప్పగిస్తోంది. 353(సీ) జాతీయ రహదారిపై మేడిపల్లి వద్ద వసూలు కేంద్రం(టోల్ ప్లాజా) ఏర్పాటుచేశారు. కొద్ది రోజుల్లో దీన్ని ప్రారంభించబోతుండగా, ప్రస్తుతం ట్రయల్ రన్‌ని ర్వహిస్తున్నారు. ఏ వాహనానికి ఎంత టోల్ పన్ను వసూలు చేయాలనేది ఇప్పటికే నిర్ణయించారు. అయితే రహదారి నిర్వహణ అధ్వానంగా మారి, గుంతలు పడి ఇబ్బందులు పడుతున్నా..

దారి సుంకం చెల్లించాలా అని వాహనదారులు వాపోతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ఈ దారి అక్కడక్కడా కుంగిపోగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిని మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

# విలువైన భూముల్లో అక్రమ కట్టడాలు

**గంగాధర,తెలంగాణ దిశ :** పట్టా భూములైనా, సర్కారు భూములైనా కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం గుంట స్థలం రూ.లక్షల్లో ధరలకు రెక్కలు రావడంతో ఇక వాణిజ్య స్థలాలను వదలిపెట్టడంలేదు. ఇందుకు చెరువులు, కుంటల శిఖం భూములతోపాటు సాగునీటి కాలువలను సైతం కబ్జా చేస్తున్నారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతుండగా అవి కాస్తా కుచించకపోయి వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడింది.గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం పరిధిలో మంగపేట ఎల్లమ్మ చెరువు నుంచి వేములవాడకు కుడి కాలువ 19 కి.మీ ఇప్పటికే పూర్తి చేశారు. కాలువ 60 మీటర్ల వెడల్పుతో నిర్మించగా కుడి వైపు దారికి 4 మీటర్లు, ఎడమ వైపు దారికి 6 మీటర్ల స్థలం వదిలిపెట్టారు. ఇక వాణిజ్య కేంద్రంగా ఉన్న గంగాధర ప్రధాన కూడలిలో మాత్రం 1.6 కి.మీ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా దారులకు స్థలం వదిలి కాలువ తవ్వారు. ఈ కాలువ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీలు, వాటికింద ఉపకాలువల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టారు. ఇక ర్యాలపల్లి వైపు ఎడమకాలువ 20.5 కి.మీ 40 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయగా దానికింద 10 ఉపకాలువలు తవ్వారు. భూసేకరణ జరిపి బాధితులకు అప్పటికే నష్టపరిహారం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కాలువ పక్కనున్న భూములు పంటలకు అనువుగా ఉండి కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్ గ్రామ పంచాయతీ)లో గుంట స్థలం కనీస ధర రూ.15 లక్షలు పలుకుతుండగా కబ్జారాయుళ్ల కన్నుపడింది. గంగాధర ప్రధాన కూడలి నుంచి కురిక్యాల రెవెన్యూ శివారు (పిట్టలపల్లి) వరకు 1.6 కి.మీ వాణిజ్య కేంద్రంగా ఉండి ఇక్కడి భూములకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండు ఉంది. కొందరు కాలువ పక్కనున్న దారులను వదిలిపెట్టకుండా ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. గతంలో కాలువ నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు అక్రమ కట్టడాలతో నష్టపరిహారం పొందగా, మరికొందరు కాలువ తవ్వకం జరిగి దారులకు వదిలిపెట్టిన స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకొందరు ఇదంతా తమదే స్థలమంటూ కాలువ భూములను అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటంతటికీ సాగు నీటిశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు న్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ జరిపిన అధికారులు అప్పట్లోనే హద్దులు నిర్ణయించి కంచె వేస్తే విలువైన భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయాలు ఉన్నాయి.



ఇప్పటికే ఎల్లంపల్లి పైపులైన్ల వెంట దారులతోపాటు పైపులైన్ల పైభాగాన్ని ఆక్రమించి పంటలు వేస్తుండగా పైపులైన్లకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కాలువల భూములు కాపాడాల్సిన అవసరముంది. నిర్మాణ దశలో ఉన్న కాలువ భూములు ఎవరు ఆక్రమించినా సర్వే చేసి తొలగిస్తాం. కాలువకు కుడి వైపు ఆరు మీటర్లు, ఎడమ వైపు 7 మీటర్ల దూరంలో మురుగుకాలువలు నిర్మించి దారులు వేయాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ జరిపి నష్టపరిహారం కూడా అందజేశాం. గతంలో నిర్మించిన వాటికి కూడా పరిహారం అందజేశాం.


# తగ్గుతున్న ప్రాతినిధ్యం



భారతీయకార్పొరేట్ కంపెనీల్లో మహిళా డైరెక్టర్ల ప్రాతినిధ్యం తగ్గుతున్నదట. నిఫ్టీలో లిస్ట్ అయిన టాప్–100 కంపెనీల్లోని ఐదు శాతం సంస్థల్లో ఇప్పటికీ మహిళా ఇండిపెండెంట్ డైరెక్టర్లు లేరట. కార్పొరేట్ గవర్నెన్స్ సర్వే సంస్థ.. 'ఎక్సలెన్స్ ఎనేబ్లర్స్' తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం.. ఈ విషయాన్ని బయట పెట్టింది. గత మూడేళ్లుగా ఈ సంఖ్య క్రమక్రమంగా తగ్గుతున్నదనీ, అదే సమయంలో ఇండిపెండెంట్ డైరెక్టర్ల సంఖ్య పెరుగుతున్నదని వెల్లడించింది. 'ఎక్సలెన్స్ ఎనేబ్లర్స్' సర్వే ప్రకారం.. భారతీయ కార్పొరేట్ సంస్థల్లో మహిళా డైరెక్టర్ల సంఖ్య.. 2021లో 57 ఉండగా.. 2022లో 56కు, 2023లో 54కు,2024లో 53కు పడిపోయింది. అయితే,మొత్తం డైరెక్టర్ల శాతంలో మహిళా డైరెక్టర్ల సగటు మాత్రం అలాగే (20 శాతం) ఉంది.

మహిళా స్వతంత్ర డైరెక్టర్లు మాత్రం.. 2021లో 101 మంది ఉండగా.. 2022లో 133, 2023లో 139, 2024లో 147కు పెరిగారు. కార్పొరేట్ కార్యాల యాల్లో సమర్థులైన మహిళలను గుర్తించడం, వారికి వృత్తిపరమైన పురోగతిని కల్పించినప్పుడే ఆయా సంస్థల బోర్డుల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని ఈ సర్వే చెబుతున్నది. అదే సమయంలో చైర్‌పర్సన్/ఎండీలుగా ఎదగడానికి, వివిధ బోర్డుల కమిటీలలో చేరి, వాటికి అధ్యక్షత వహించడంపైనా మహిళా ఉద్యోగులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని సూచిస్తున్నది.

# వేగంగా విస్తరిస్తున్న షుగర్..



ప్రపంచంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో.. మధుమేహం ముందు వరుసలో ఉన్నది. వయసు, లింగభేదం లేకుండా ఈ వ్యాధి అందర్నీ ఇబ్బంది పెడుతున్నది. అయితే.. గర్భిణుల్లో షుగర్ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తున్నదని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జెస్టేషనల్ డయాబెటిస్.. తల్లితోపాటు బిడ్డకూ హాని కలిగిస్తుందని హెచ్చరిస్తున్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే.. ఆరోగ్యవంతమైన, పండంటి బిడ్డలకు జన్మనివ్వొచ్చని చెబుతున్నారు.

సాధారణ మహి ళలతో పోలిస్తే.. గర్భిణుల్లో ఇన్సులిన్‌కు ప్రతికూల హార్మోన్లు (కార్టి సోల్),మాయకు సంబంధించిన హార్మోన్లు ఎక్కువగా విడుదల అవుతాయట. ఫలితంగా ఇన్సులిన్ సామర్థ్యం తగ్గి.. రక్తంలో గ్లూకోజ్ స్థాయులు పెరుగుతాయట.

దీనిని నిర్లక్ష్యం చేస్తే.. తల్లికి ఇబ్బంది కలగడంతోపాటు పిండం ఎదుగుదల మీదా ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. డయాబెటిస్ ముదిరితే.. పిండం అవయవాల తయారీ మందగిస్తుందనీ, పుట్టిన తర్వాత గుండె, ఊపిరితిత్తుల జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుందనీ చెబుతున్నారు.

దీనినుంచి బయటపడాలంటే.. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని, ఆహారం విషయంలో నియమాలు పాటించాలని సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు రక్తంలో గ్లూకోజ్ మోతాదును పరీక్షించుకుంటూ.. వైద్యుల సలహామేరకు మందులు వాడాలని అంటున్నారు.

# రాజధానికి మరో 4285 కోట్లు..!



**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీ రాజధాని అమరావతికి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రాజధాని నిర్మాణానికి రూ.4285 కోట్ల నిధులు విడుదల చేసింది. రాజధాని నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులు 25 శాతం విడుదల చేసింది. ఈ నిధులకు కేంద్రం వాటా రూ.750 కోట్లు కలిపి మొత్తం రూ.4285 కోట్లు ఇచ్చింది. అమరా వతిలో పనులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 25 శాతం నిధులు అడ్వాన్స్‌గా ఇవ్వాలని సీఆర్డీఏ కేంద్రాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా నిధులను విడుదల చేసింది.ప్రధాని మోదీఏపీ రాజధాని అమరావతిలో పర్యటనకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ప్రధానిమోదీ ఏప్రిల్ మూడో వారంలో ఏపీకి రానున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటన కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. ఈ కార్యక్రమానికి లక్షల్లో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా ఏర్పాట్లు చేస్తుంది. వెలగపూడి సచివాలయం సమీపంలో 250 ఎకరాల్లో భారీ బహి రంగ సభ నిర్వహించేందుకు పనులు ప్రారం భించారు. సామాన్య ప్రజలతో పాటు వీవీఐపీలు, వీఐపీల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభాస్థలికి చేరుకునేందుకు మొత్తం 8 మార్గాలను గుర్తించారు.రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయి. అమరావతి నగరాన్ని రోడ్డు, రైలు, వాయు మా ర్గాల ద్వారా నేరుగా అనుసంధానిం చేలా, అత్యాధునిక పరిజ్ఞానంతో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. అమరావ తిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రైల్వేస్టేషన్‌ను నిర్మించేందుకు ప్రణా ళిక సిద్ధం చేశారు. నెక్కల్లు–పెదపరిమి సమీపం లో దేశంలోకెల్లా అతిపెద్ద రైల్వేస్టేషన్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కోసం ఏపీ ప్రభుత్వం రైల్వేశాఖకు సుమారు 1500 ఎకరాలు అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.అమరా వతి రైల్వేలైన్‌ను రెండు దశలుగా చేపట్టాలని కేంద్ర రైల్వేశాఖ ఇటీవలనిర్ణయించిం ది. మొత్తం 56.53 కి.మీ. రైల్వేలైన్‌లో ఖ మ్మంజిల్లా ఎర్రుపాలెం నుంచి 27 కి.మీ. లైన్‌ను మొదటి దశగా చేపట్టనున్నారు. ఈ రైల్వే లైన్ కోసం రెండు నెలల్లో టెండర్లను ఆహ్వానించనున్నారు.

తొలి దశలోనే దాములూరు–వైకుంఠపురం మధ్య కృష్ణానదిపై 3.2 కి.మీ. మేర రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపడతారు. వచ్చే రెండు నెలల్లోగా భూసేకరణ పూర్తి చేయగలమ ని రైల్వే శాఖ ధీమా వ్యక్తం చేసింది. తొలిదశ పనుల కోసం సుమారు రూ.800 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. తాడికొండ మండలంలో రైల్వే లైన్ కోసం భూములిచ్చేందుకు కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో అక్కడ భూసేకరణ ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.అమరావతి రైల్వేస్టే షన్‌ను ఎయిర్ పోర్టు తరహాలో నగర శివారులో ఏర్పాటు చేయాల ని భావిస్తున్నారు. దేశంలోకెల్లా అతిపెద్ద మోడల్ రైల్వేస్టేషన్‌గా అత్యాధునిక సౌకర్యాలతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా దీనిని నిర్మించాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

# పిల్లల్లో చదవడం పై ఆసక్తి పెంచడం ఎలా?



చదవడం అనేది మన జీవితం లోని ముఖ్యమైన భాగం.చాలా మంది పిల్లలు చదవడం పై ఆసక్తి కోల్పోతున్నారు. ఇది వారి అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. చదవడం లో ఆసక్తి పెంచడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి. పిల్లలు చదవడానికి సరైన పుస్తకాలను ఎంచుకోవడం చాలా ముఖ్యం.వారికి ఆసక్తి కలిగించే కథలు, కామిక్ బుక్స్, లేదా సరదా మరియు సులభంగా చదవగలిగే పుస్తకాలను ఇవ్వడం వల్ల వారు చదవడానికి ఆసక్తి పెరుగుతుంది. పిల్లలు వారి ఆసక్తికి అనుగుణంగా పుస్తకాలు ఎంచుకోడం వల్ల చదవడం మరింత సుఖంగా మారుతుంది.పిల్లలతో కలిసి చదవడం. పిల్లలు తమ తల్లిదండ్రుల లేదా పెద్దలతో కలిసి పుస్తకాలు చదివే సామర్థ్యాన్ని పెంచుతారు. వారు పుస్తకంలో ఉన్న కథల గురించి మాట్లాడడం, ప్రశ్నలు అడగడం, భావాలను పంచుకోవడం ద్వారా చదవడానికి ఆసక్తి పెరుగుతుంది.చదవడానికి ఒక ప్రత్యేక సమయం ఏర్పాటు చేయడం.ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం. పిల్లలు ఇ–బుక్స్, ఆడియో బుక్స్ లేదా వీడియోలు ద్వారా కథలు వినడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇది వారిచదవడంపై ఆసక్తిని పెంచే ఒక మార్గం. పిల్లలకు ప్రతిభా వంతమైన విజయం కోసం ప్రోత్సాహం ఇవ్వడం చాలా ముఖ్యం చదవడం ద్వారా వారు మంచి నైపుణ్యాలను, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటారు.

ప్రతి రోజు ఒక స్థిరమైన సమయాన్ని నిర్ణయించు కుని ఆ సమయంలో పిల్లలు పుస్తకాలు చదవాలి.ఈ అలవాటు వారిలో చదవడానికిసంబంధించిన ఆసక్తిని పెంచుతుంది.చదవడం ద్వారావారు మంచి నైపుణ్యాలను, జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటారు. ఈ విధంగా, పిల్లల్లో చదవడంపై ఆసక్తి పెంచవచ్చు.

## కోడిగుడ్డు ధర 21 వేలు!

### వేలంలో పోటీ పడి మరీ కొనుగోలు



లండన్, : సాధారణంగా ఓ కోడిగుడ్డు ధర రూ.6–7 ఉంటుంది. అయితే, యూకేలో మాత్రం ఓ కోడిగుడ్డు ఏకంగా రూ.21 వేలకు అమ్ముడుపోయింది. పైగా దీనిని కొనేందుకు ఔత్సాహికులు పోటీ పడ్డారు. అండాకారంలో ఉండే సాధారణ కోడిగుడ్లకు భిన్నంగా గుండ్రంగా ఉండటమే ఈ కోడిగుడ్డు ప్రత్యేకత. ఏమాత్రం తేడా లేకుండా, పూర్తి గుండ్రంగా ఉండే కోడిగుడ్లు చాలా అరుదుగా కనిపిస్తాయని, వంద కోట్ల గుడ్లలో ఒకటి ఇలా ఉంటుందని చెప్తున్నారు. బెర్క్‌షైర్‌కు చెందిన ఎడ్ పౌనెల్ అనే వ్యక్తి మొదట దీన్ని ఒక పబ్‌లో సుమారు రూ.16 వేలకు కొన్నారు. అయితే, అరుదైన ఈ గుడ్డును దాతృత్వ వేలం కోసం వినియోగించాలని నిర్ణయించి ఇవెంటస్ ఫౌండేషన్‌కు విరాళంగా ఇచ్చారు. ఈ ఫౌండేషన్ నిర్వహించిన వేలంలోనే అసాధారణ రీతిలో రూ.21 వేలకు ఈ కోడిగుడ్డు అమ్ముడుపోయింది.

# ప్రశాంత్ నీల్ లైనప్.. డౌట్స్ అక్కర్లే!



ఇండియా వ్యాప్తంగా ఎన్నో భాషలు ఉన్నా.. అందులో కొన్ని ఇండస్ట్రీల్లో మాత్రమే పాన్ ఇండియా రేంజ్‌లో పేరున్న దర్శకులు ఉన్నారు. మరీ ముఖ్యంగా సౌత్ ఇండియాలో ఇప్పటికే కొందరు డైరెక్టర్లు తమదైన మార్కును చూపించారు. అలాంటి వారిలో కన్నడ ఇండస్ట్రీకి చెందిన ప్రశాంత్ నీల్ ఒకడు. 'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో దేశ వ్యాప్తంగా ప్రభావాన్ని చూపించిన అతడు.. వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తున్నాడు. 'కేజీఎఫ్'తో వరల్డ్ ఫేమస్ అయిన ప్రశాంత్ నీల్.. ఆ తర్వాత పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో 'సలార్: సీజ్‌ఫైర్' సినిమాను చేశాడు. ఇది మంచి రెస్పాన్స్‌ను అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ మీద భారీ ప్రభావాన్నే చూపించింది. దీని తర్వాత అతడు ఈ చిత్రం సీక్వెల్‌ను చేస్తున్నట్లు ప్రకటించాడు. అలాగే, జూనియర్ ఎన్టీఆర్‌తోనూ ఓ భారీ ప్రాజెక్టును అనౌన్స్ చేసేశాడు. ప్రశాంత్ నీల్ తన తదుపరి ప్రాజెక్టును జూనియర్ ఎన్టీఆర్‌తోనే చేస్తాడని, ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన వర్క్‌నే చేస్తున్నాడని జోరుగా వార్తలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకుని హొంబళే ఫిల్మ్స్ సంస్థ 'సలార్ 2' సినిమా షూటింగ్ ప్రారంభం అయిందని అధికారికంగా ప్రకటించింది. దీంతో ప్రశాంత్ లైనప్‌పై అనుమానాలు పెరిగిపోయాయి. వాస్తవానికి ప్రశాంత్ నీల్ ముందుగా జూనియర్ ఎన్టీఆర్ సినిమానే చేయాలని అనుకున్నా.. హొంబళే సంస్థ 'సలార్ 2'నే కంప్లీట్ చేయాలని పట్టుబట్టినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ప్రభాస్ ఇప్పుడు వరుసగా 'ది రాజా సాబ్'తో పాటు 'ఫౌజీ' మూవీలను చేసేందుకు ప్లాన్ చేసుకున్నాడు. కాబట్టి 'సలార్ 2' మూవీకి ఇప్పట్లో డేట్లు కేటాయించలేడు. కాబట్టి ఈ విషయంలో ప్రశాంత్ నీల్ సేఫ్ అయిపోయాడని అనుకోవచ్చు. జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇప్పుడు 'వార్ 2' సినిమా షూటింగ్‌లోనే పాల్గొంటున్నాడు. వచ్చే జనవరి లేదా ఫిబ్రవరి వరకూ అతడు కూడా ఖాళీగా ఉండడు. కాబట్టి అప్పటి వరకూ ప్రశాంత్ తన పనులతో తాను బిజీగా ఉండొచ్చు. ఆ తర్వాత ఎన్టీఆర్ సినిమాను పట్టాలెక్కించే అవకాశం ఉంది. అంటే ప్రస్తుతానికి ప్రశాంత్ నీల్ ఓటు తారక్‌కు మాత్రమే వేయాలని చూస్తున్నట్లు చెప్పుకోవచ్చు. ఈ టైంలో అతడు ఈ సినిమాకు సంబంధించిన బౌండెడ్ స్క్రిప్టును రెడీ చేసుకోవాలని చూస్తున్నట్లు తెలిసింది.

# 'బేబీ జాన్' కీర్తి..



సౌత్ ఇండియాలో అందం పరంగా కానీ,నటనపరంగా కానీ అద్భుతంగా రాణించి అవార్డులు, రివార్డులు అందుకున్న హీరోయిన్లు చాలా తక్కువ మంది మాత్రమే ఉన్నారు. ఆతక్కువమందిలో ఒకరుకీర్తి సురేష్. ఈమె తల్లి మేనకా కూడా ఒకప్పుడు సినీ హీరోయినే. మలయాళంలో పెద్దసూపర్ స్టార్. కీర్తిసురేష్ తండ్రి కూడా ఒక డైరెక్టర్. అమ్మానాన్నలు ఇద్దరు సినీ ఇండస్ట్రీ కి చెందినవాళ్లు కావడంతో కీర్తి సురేష్ బాల్యం నుండే నటించడం మొదలు పెట్టింది. బాలనటిగా పలు మలయాళం సినిమాల్లో నటించిన ఈమె, ఆ తర్వాత హీరోయిన్ గా రీ ఎంట్రీ ఇచ్చి నేడు ఈ స్థానం వరకు వచ్చింది. 'మహానటి' సావిత్రిగా అద్భుతమైన నటన కనబర్చి నేషనల్ అవార్డుని కూడా అందుకుంది. అప్పటి నుండి గ్లామర్ రోల్స్ కి దూరంగా కేవలం నటనకి ప్రాధాన్యం ఉన్న పాత్రలను మాత్రమే చేస్తూ వచ్చింది.ఇది ఇలా ఉండగా రీసెంట్ గానే ఈమె తన బాల్య స్నేహితుడు ఆంటోని ని వివాహం చేసుకుంది. ఈ పెళ్ళికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. చూడముచ్చటగా జంట ఉందంటూ కామెంట్స్ కూడా చేశారు. అయితే ఇప్పుడు ఈమె వివాదాల్లోకి చిక్కుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే బాలీవుడ్ లో ఈమె 'బేబీ జాన్' అనే చిత్రం లో హీరోయిన్ గా నటించింది. కోలీవుడ్ లో సూపర్ హిట్ గా నిల్చిన 'తేరి' చిత్రానికి ఇది రీమేక్. వరుణ్ ధావన్ హీరోగా నటించిన ఈ సినిమా, క్రిస్మస్ కానుకగా ఈ నెల 25 వ తారీఖున ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కాబోతుంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రొమోషన్స్ లో కీర్తి సురేష్ చాలా చురుగ్గా పాల్గొంటుంది. అందులో భాగంగా ఆమె ధరించిన దుస్తులు ఇప్పుడు నేషనల్ లో సెన్సేషనల్ టాపిక్ అయ్యింది. తన శరీరాన్ని పూర్తిగా ఎక్స్పోజ్ చేస్తూ ఎరుపు రంగు దుస్తులు ధరించిన ఈమె, మెడలో మంగళసూత్రం తో దర్శనమించింది. ఇది చూడగానే ఈమె ఏంటి ఇలా వచ్చింది. మోడరన్ డ్రెస్ లో ఇలా ఒక అమ్మాయి రావడం ఇప్పటి వరకు మేము ఎవ్వరూ చూడలేదంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి దుస్తులు వేసుకొచ్చినప్పుడు మంగళ సూత్రంని అలా అగౌరవపర్చకుండా,పైన ఏమైనా కప్పుకొని వచ్చునంటే బాగుండేది అని, చూసే ప్రేక్షకులకు ఇలా చేస్తే నచ్చదు అంటూ ఆమె అభిమానులు సైతం సోషల్ మీడియా లో కామెంట్స్ చేస్తున్నారు. మరి దీనిపై ఆమె స్పందిస్తుందా లేదా అనేది చూడాలి. ఇది ఇలా ఉండగా కీర్తి సురేష్ కి 'బేబీ జాన్' బాలీవుడ్ లో మొట్టమొదటి సినిమా. కానీ రీమేక్ సినిమా అవ్వడం తో ఈ చిత్రం కూడా ఫ్లాప్ అవుతుందని విశ్లేషకులు అంటున్నారు. ట్రైలర్ కి కూడా ఆడియన్స్ నుండి అంతంత మాత్రం గానే రెస్పాన్స్ వచ్చింది.



# మోక్షజ్ఞ డెబ్యూ మూవీకి డైరెక్టర్ ఛేంజ్

నందమూరి బాలకృష్ణ వారసుడిగా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్న నందమూరి మోక్షజ్ఞ తేజ డెబ్యూ సినిమా గురించి ఇటీవల పలు రూమర్లు సంచలనం రేపుతున్నాయి. ప్రారంభంలో, మోక్షజ్ఞ తేజ మొదటి సినిమా కోసం ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారని వార్తలు వచ్చాయి.కానీ,తాజాగా వచ్చిన సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్టు ఇప్పుడు వాయిదా పడింది. ఆపిన ప్రాజెక్టుతో సంబంధం ఉన్న పుకార్లు నిజం కాదని, దీని పట్ల క్లారిటీ ఇచ్చారు ప్రొడక్షన్ హౌస్. అలాగే, కొన్ని రోజుల క్రితం టాలీవుడ్ లోని కొంతమంది వర్గాల్లో నాగ్ అశ్విన్, "కల్కి" సినిమా ప్యాట్‌లో ఉన్నాడు. అందువల్ల, మోక్షజ్ఞ తేజ మొదటి చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తారని కూడా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలు కూడా అసత్యమని బయటపడ్డాయి.ప్రస్తుతానికి నాగ్ అశ్విన్ "కల్కి 2" సీక్వెల్ పనుల్లో బిజీగా ఉన్నారు. అలాగే,ఈ సినిమాపూర్తయ్యే వరకు, ఇతర హీరోలతో ఆయన సినిమా చేసే అవకాశం లేదు. ప్రశాంత్ వర్మ,



"హనుమాన్" సినిమాతో సంచలన విజయాన్ని సాధించిన తర్వాత, మోక్షజ్ఞ తేజతో కూడి సినిమా చేస్తారని మొదట ప్రకటిం చారు. కానీ, ఈ ప్రాజెక్టు ఆగిపోవడం గురించి వచ్చిన వార్తలు నిజం కావు అని,నిర్మాణ సంస్థ ఎస్‌ఎల్‌వీ సినిమాస్ స్పష్టం చేసింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215